ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM
గురువారం, 28 నవంబరు 2024







నింగికెగసిన అరుణతార

- ఖమ్మం జిల్లా సీపీఐ కార్యదర్శి పోటు ప్రసాద్ హఠాన్మరణం
- లకారం ట్యాంక్‌బండ్‌పై ఉదయం వాకింగ్ చేస్తుండగా గుండెపోటు
- ఆస్పత్రికి తరలించేలోపే తుది శ్వాస
- శోకసంద్రంలో మునిగిన వామపక్షాల శ్రేణులు
- నివాళులు అర్పించిన మంత్రి పొంగులేటి, తమ్మినేని
- కంటతడి పెట్టిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ఖమ్మం సంక్షేమవిభాగం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిబద్ధత గల కమ్యూనిస్టు నాయకుడు, సీపీఐ ఖమ్మం జిల్లా సమితి కార్యదర్శి పోటు ప్రసాద్(64) బుధవారం హఠాన్మరణం చెందడంతో వామపక్ష శ్రేణులు శోకసంద్రంలో మునిగాయి. ఖమ్మం నగరంలోని లకారం ట్యాంక్‌బండ్‌పై ఉదయం 6గంటలకు స్నేహితులతో కలిసి వాకింగ్ చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే వారు సీపీఆర్ చేస్తుండగా అపస్మారక స్థితికి వెళ్లారు. దీంతో సమీపంలోని మమత ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మరణించారని వైద్యులు ధ్రువీకరించారు. తరువాత ప్రసాద్ భౌతికకాయాన్ని నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయానికి తరలించారు. జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు, జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు వచ్చి ప్రసాద్ భౌతికకాయంపై అరుణపతాకం కప్పి నివాళులర్పించారు. ప్రసాద్‌కు భార్య నిర్మల, కుమారుడు సాధ్విక్ ఉన్నారు. రెండేళ్ల క్రితమే ప్రసాద్‌కు బైపాస్ సర్జరీ జరిగింది.

నిరంతర పోరాటశీలి..

ఉమ్మడి నల్లగొండ జిల్లా గరిడేపల్లి మండలం రంగాపురం (వెలిదండ)లో 1960 సెప్టెంబరు 1న పోటు రాఘవయ్య, నక్కుబాయి దంపతులకు ప్రసాద్ జన్మించారు. తండ్రి రాఘవయ్య (డాబా రాఘవయ్య) తెలంగాణ సాయుధ పోరాటంలో కీలకంగా పనిచేశారు. అజ్ఞాత జీవితం గడుపుతున్న సమయంలో రాఘవయ్య కుటుంబంపై నైజాం ప్రభుత్వం తీవ్ర వత్తిడి పెట్టింది. రాఘవయ్య సమాచారం చెప్పాలని ప్రసాద్ నాయనమ్మ యర్రమ్మకు నైజాం పోలీసులు శిరోముండనం చేసి ఊరేగించారు. ఆ తర్వాత ప్రసాద్ తన నాయనమ్మతో కలిసి గ్రామం విడిచి గుంటూరు వెళ్లి మిర్చి యార్డులో కూలి పనులు చేశారు. చిన్నతనం నుంచే ఎన్నో పోరాటాలను ఎదుర్కొన్న ఆయన (మిగతా 6వ పేజీలో)

రేపు నగరంలో ప్రసాద్ అంత్యక్రియలు

అమెరికాలోఉన్న ప్రసాద్ కుమారుడు సాధ్విక్ ఖమ్మం వచ్చేందుకు రెండు రోజులు పడుతుండటంతో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించాలని కుటుంబసభ్యులు నిర్ణయించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వారం పాటు సంతాప కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పార్టీ కార్యకర్తల ర్యాలీ నడుమ శుక్రవారం ప్రసాద్ అంతిమయాత్ర ఖమ్మంలో నిర్వహించనున్నారు.



ఆశలకు రెక్కలు

విమానం ఎగిరేనా!?

- కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు వడివడిగా అడుగులు
- ఇప్పటికే చుంచుపల్లి మండలంలో 950 ఎకరాల స్థలం ఎంపిక
- ప్రత్యేకంగా చొరవ తీసుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడిని కలిసి విన్నపం
- గత కొంతకాలం నుంచే మంత్రి తుమ్మల విస్తృత ప్రయత్నాలు
- సకల అంశాలతో ప్రతిపాదనల సమర్పణ..
- విమానయాన అధికారుల సర్వే నివేదికే తరువాయి...
- నేడు కేంద్రమంత్రిని కలవనున్న కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు
- భారీ పరిశ్రమల నెలవైన భద్రాద్రి జిల్లాకు ఎయిర్‌పోర్టు ఎంతో ఉపయోగకరం
- రాకపోకలతో మరింత అభివృద్ధి జరిగే అవకాశం

కొత్తగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇందుకోసం చుంచుపల్లి మండల పరిధిలోని రామవరం, గరీబ్‌పేట గ్రామాల పరిధిలో ఉన్న 950ఎకరాల స్థలాన్ని అధికారులు ఎంపిక చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపారు. ఇటీవల రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడిని కలిసి విన్నవించారు. అలాగే ఈనెల 26న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు రెక్కలు వచ్చినట్టుగా భావిస్తున్నారు. సీఎం విజ్ఞప్తి పట్ల కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కూడా సానుకూలంగా స్పందించినట్టు సమాచారం. కొత్తగూడెంలో ఫీజ్‌బిలిటీ అధ్యయనం చేసిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి హామీ ఇచ్చినట్టు సమాచారం.

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆగస్టు 31న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఎయిర్‌పోర్టుకు సంబంధించిన 950ఎకరాల భూమి తదితర సాంకేతికంగా ఉన్నటువంటి అంశాలను ప్రతిపాదనలతో జతచేశారు. ఈ క్రమంలో ఆయన గురువారం ఢిల్లీలో కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడిని కలిసి ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై చర్చించనున్నారు. ఇప్పటికే ప్రతిపాదనలన్నీ భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్ ద్వారా సిద్ధం చేశారు. వరుస వినతుల నేపథ్యంలో ఎయిర్‌పోర్టుకు సంబంధించిన స్థల సేకరణ చేపట్టేందుకు త్వరలో కేంద్ర విమానయానశాఖకు చెందిన సాంకేతిక (మిగతా 6వ పేజీలో)

మంత్రి తుమ్మల చొరవ



కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గతంలోనే కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్రమంత్రికి, కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయడం వల్ల ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎంతో అభివృద్ధి చెందుతుందని, పారిశ్రామికంగా మరింతగా అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన అంటున్నారు.

ఎలాంటి ఇబ్బందులు లేవు.. : కూనంనేని ఎమ్మెల్యే, కొత్తగూడెం



వరంగల్‌లోని మామునూరులో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యల వల్ల కొత్తగూడెం ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అక్కడ ఎయిర్‌పోర్టు నిర్మాణం జరిగినా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ప్రయాణికులు వెళ్లరు.. వారికి కొత్తగూడెం ఎయిర్‌పోర్టే అనువుగా ఉంటుంది. ఇక కొత్తగూడెం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు సుమారు 300కిలోమీటర్ల దూరంలో ఉంది. కొత్తగూడెంలో ఏర్పాటు చేసేది గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు. అందువల్ల నిబంధనల పరంగా ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు ఉండవు.



నదికి హారతులు సమర్పిస్తున్న వైదిక సిబ్బంది

గౌతమీ గంగా మంగళమిదే..

- భద్రాచలంలో ఘనంగా పుణ్యనది కార్యక్రమం
- వేద మంత్రాలతో దీపస్తంభ హారతుల సమర్పణ
- గోదావరికి అష్టోత్తర శతనామార్చన పూజ 6



ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం

- రోజుకు 147మందితో 2వేల పత్రాల డేటా ఎంట్రీ
- డిసెంబరు 6 నాటికి పూర్తి చేయాలని లక్ష్యం
- ఎంట్రీ వేళ బయటపడుతున్న సర్వే లోపాలు 6

కళ్లల్లో కారం చల్లి... ఊపిరి ఆడకుండా చేసి..

- నేలకొండపల్లిలో వృద్ధ దంపతుల దారుణహత్య
- అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తుల ఘాతుకం
- తెలిసిన వారి పనేనని అనుమానాలు
- ఉలిక్కిపడిన పట్టణం.. స్థానికుల్లో భయాందోళనలు



వెంకటరమణ, కృష్ణకుమారి(ఫైల్)

నేలకొండపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలో దారుణం చోటుచేసుకుంది. పక్కాప్లాన్‌తో వచ్చి, రెక్కీ నిర్వహించిన గుర్తు తెలియని వ్యక్తులు... వృద్ధ దంపతులను దారుణంగా హత్య చేశారు. ఈ ఘటనలో యర్రా వెంకటరమణ(62), కృష్ణకుమారి(60) ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటనతో స్థానికులు భయాందోళనలకు లోనవుతున్నారు. నేలకొండపల్లికి చెందిన వెంకటరమణ బియ్యం వ్యాపారం చేసేవాడు. ఈయనకు ఒక కుమారుడు నరేష్, కుమార్తె అనురాధ ఉన్నారు. ఇద్దరికీ వివాహాలయ్యాయి. కుమారుడు హైదరాబాద్‌లో, కుమార్తె జగ్గయ్యపేటలో ఉంటున్నారు. వెంకటరమణ దంపతులు స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని ఇంట్లో నివాసం ఉంటున్నారు. తమకు గదులు అద్దెకు కావాలని పదిరోజుల క్రితం ముగ్గురు వ్యక్తులు వచ్చారు. తర్వాత ఇల్లు తమకు నచ్చిందని కొంతనగదు అడ్వాన్స్‌గా ఇచ్చారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి సదరు వ్యక్తులు వెంకటరమణ ఇంటికి వచ్చి భోజనం చేసి వెళ్లినట్టు పక్క పోర్షన్‌లో అద్దెకుంటున్న వారు చెబుతున్నారు. సదరు వ్యక్తులు మంగళవారం రాత్రి కూడా వచ్చారు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు. బుధవారం ఉదయం కల్లా వెంకటరమణ దంపతులు శవాలుగా కనిపించారు. ఇద్దరి కళ్లల్లో కారం చల్లి, ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆనవాళ్లు దొరక్కుండా ఘటనా స్థలంతోపాటు ఇంటి చుట్టూ కారం పొడి చల్లారు. తరువాత ఇంటి బయట తాళం వేసి వెళ్లిపోయారు.

ఎలా తెలిసిందంటే..



జగ్గయ్యపేటలో ఉంటున్న వెంకటరమణ కుమార్తె అనురాధ ప్రతి రోజూ ఫోన్‌లో తల్లిదండ్రుల యోగక్షేమాలను తెలుసుకునేది. బుధవారం ఉదయం కూడా తల్లిదండ్రులకు ఫోన్ చేయగా వారు ఎంతకూ ఫోన్ లిఫ్ట్ చేయలేదు. దీంతో ఇంట్లో అద్దెకు ఉండే వారికి ఫోన్ చేయగా, ఇంటికి తాళం వేసి ఉందని వారు చెప్పారు. తర్వాత వారు గ్రామంలోనే ఉంటున్న మృతుడి సోదరుడు రమేష్‌కు సమాచారం అందించారు. అతడు వచ్చి తాళం పగులగొట్టి చూడగా ఈ దారుణం బయటపడింది. దీంతో రమేష్ పోలీసులకు సమాచారం అందించాడు. వృద్ధ దంపతులు హత్యకు గురయ్యారన్న విషయం తెలియడంతో ప్రజలు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్, ఫోరెన్సిక్ బృందాలు రంగంలోకి దిగాయి.

జంట హత్యలపై పలు అనుమానాలు..

జంట హత్యలపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హత్యలకు పాల్పడ్డవారు ఇంట్లోని నగలను గానీ, నగదును కానీ ఎత్తుకెళ్లిన ఆనవాళ్లు లేవు. నగల మూట ఇంట్లోనే ఉంది. నగలను పోలీసులు పరీక్ష చేయించగా అవి రోల్డ్‌గోల్డ్ నగలుగా తేలాయి. దొంగతనం చేయటానికి వచ్చేవారికి ఇంట్లో ఉన్నవి రోల్డ్‌గోల్డ్ అని తెలియదు. కానీ ఈ సంఘటనలో నగల మూటను ముట్టుకోలేదు. మృతురాలి ఒంటిపై ఉన్న నగలు సైతం అలాగే ఉన్నాయి. బాగా తెలిసిన వ్యక్తులే హత్యకు పాల్పడ్డారా? లేక సుపారీ గ్యాంగ్‌ను ఉపయోగించారా? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. పోలీసులు హతుల ఇంటి పరిసరాల్లో అందుబాటులో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఏసీపీ తిరుపతిరెడ్డి పంచనామా నిర్వహించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు.



మెరుస్తున్న తెల్లబంగారం

- పెరుగుతున్న పత్తి ధర
- ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాలుకు రూ.7,100

ఖమ్మం మార్కెట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో పత్తికి డిమాండ్ పెరుగుతోంది. క్రమంగా ధరలు కూడా పెరుగుతున్నాయి. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం క్వింటాలు పత్తిని రూ.7,100 ఆన్‌లైన్ బిడ్డింగ్ ధరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్‌లో వారంరోజుల క్రితం క్విటా పత్తి ధర రూ.6,600 నుంచి రూ.6,750 వరకు ఉండగా క్రమంగా పెరుగుతూ వస్తోంది. వారం రోజుల వ్యవధిలోనే క్వింటాకు రూ.500 పెరగడం గమనార్హం.. పత్తికి ఈ ఏడాది సీజన్ ప్రారంభంలో మార్కెట్‌లో కొంత డిమాండ్ ఉండగా ఆ తరువాత తగ్గుతూ వచ్చింది. అంతర్జాతీయ మార్కెట్‌లో గింజ, దూది ధరలు తగ్గడంతో డిమాండ్ భారీగా పడిపోయింది. దీంతో పత్తి సీజన్ ప్రారంభంలో క్వింటాలు రూ.7,000 వరకు పలికిన పత్తి ఆ తరువాత రూ.5,500 నుంచి రూ.6,000 వరకే కొనుగోలు చేశారు.

ఈ ఏడాది అధిక వర్షాలతో పంట దెబ్బతినడంతోపాటు ప్రస్తుతం రైతుల వద్ద పంట నిల్వలు ఎక్కువగా లేకపోవడంతోనే ధరలు (మిగతా 6వ పేజీలో)

ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం...

- త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి
- కూసుమంచి మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కూసుమంచి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎవరెంత రెచ్చగొట్టినా, కారు కూతలు కూసినా.. పేదోళ్ల అండ ఉన్నంతవరకు తమను ఎవరూ ఏమీ చేయలేరని రాష్ట్ర రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మంజిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువు, ముత్యాలగూడెం, చేగొమ్మ గ్రామాల్లో సుమారు. రూ.2 కోట్ల విలువైన సీసీ రహదారుల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

అనంతరం చేగొమ్మ గ్రామంలో ఏర్పాటుచేసిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ విపక్షాలు తమ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు, ప్రచారాలు, విమర్శలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఎంత రెచ్చగొట్టినా ఏమీ ప్రయోజనం ఉండదని తెలిపారు. తమ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావొస్తోందని, ఇచ్చిన హామీలను నెరవేర్చేపనిలోనే ఉన్నామన్నారు. తలతాకట్టు పెట్టినా అన్ని హామీలు నెరవేర్చి తీరుతామన్నారు. సన్న ధాన్యానికి రూ.500 బోనస్, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసినట్టు తెలిపారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. అన్ని గ్రామాల్లోనూ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఇవన్నీ ప్రజలిచ్చిన దీవెనలు, ఆశీస్సులతోనే నెరవేర్చుతున్నట్టు వెల్లడించారు. మిగిలిన అభివృద్ధి పనులనూ మంజూరు చేస్తామన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటేనే పేదోళ్ల రాజ్యమని ఇప్పుడు ఎలా మీ ఆశీస్సులున్నాయో, భవిష్యత్తులోనూ తమ ప్రభుత్వంపై ప్రేమానురాగాలు ఉండాలని తెలిపారు. అనంతరం చేగొమ్మలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రికి ఆయా గ్రామాల్లో డప్పులు, మేళాలతో పెద్దఎత్తున పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, మండల జిల్లా నాయకులు పాల్గొన్నారు.



కూసుమంచి మండలం ముత్యాలగూడెంలో సీసీరోడ్లకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి



రైతన్న రూట్.. డ్రాగన్ ఫ్రూట్

- ఆరోగ్యంతో పాటు సిరులు పండించే విదేశీ పంట
- తక్కువ పెట్టుబడితో రైతుకు ఎక్కువ లాభాలు
- సాగుకు అనుకూలంగా తెలంగాణ వాతావరణం
- రాష్ట్రంలో క్రమంగా విస్తరిస్తున్న తోటలు
- జిల్లాలోనూ సాగుచేస్తున్న కొందరు ఔత్సాహిక రైతులు

వివరాలు : 7లో

విమానం ఎగిరేనా!?

(5వ పేజీ తరువాయి)

సభ్యులు కలిగిన బృందం కొత్తగూడెం రానున్నట్టు సమాచారం. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఉన్నటువంటి రామవరం గరీబ్‌పేటలో స్థలాన్ని పరిశీలించి, తదుపరి కార్యాచరణపై కేంద్ర ప్రభుత్వానికి, ఇటు రాష్ట్ర ప్రభుత్వంలోని ఏవియేషన్ అధికారులకు నివేదించను న్నారు.

ప్రతిపాదనలు కార్యరూపం దాల్చేనా..?

కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కొత్త గూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చుతాయా అనేది ఆసక్తిగా మారింది. 2016లో అప్పటి బీఆర్‌ఎస్ పార్టీ కొత్తగూడెం ఎమ్మెల్యే జలగం వెంకటరావు సైతం కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని బంగారుచెలక పంచాయతీ పరిధిలో పునుకుడుచె లక గ్రామంలో సుమారు వెయ్యి ఎకరాల భూసేకరణ చేశారు. ఆ తర్వాత ఏవియేషన్ అధికారులు వచ్చి సర్వేలు సైతం నిర్వహిం చారు.

అయితే అప్పుడు బీఆర్‌ఎస్ పార్టీ మినహా మిగిలిన పార్టీలు, ప్రజాసంఘాల వారు ఆ ప్రాంతంలో విమానాశ్రయం నిర్మించవద్దని గిరిజనుల వ్యవసాయ భూములు కోల్పోతారని పెద్ద ఎత్తున ఆందో ళన నిర్వహించారు. మరెక్కడైనా సరే విమానాశ్రయం నెలకొల్పుకోవ చ్చని, తాము విమానాశ్రయం ఏర్పాటుకు వ్యతిరేకం కాదని ఆందోళ నకారులు పేర్కొన్నారు. దీంతో అప్పటినుంచి ఎయిర్‌పోర్టు ప్రతిపాద నలకే పరిమితమైంది. పునుకుడుచెలక గ్రామంలోని స్థలానికి ప్రత్యా మ్నాయంగా చుంచుపల్లి మండలంలో రామవరం గరీబ్‌పేట ప్రాంతంలో గల 950ఎకరాల స్థలాన్ని గుర్తించారు. అయితే ఈ భూమిలో 700ఎకరాల విస్తీర్ణం అటవీ ప్రాంత పరిధిలో ఉంది. ఈ భూమికి ఫారెస్ట్ క్లియరెన్స్ రావాల్సి ఉంటుంది. దీనికి ప్రత్యామ్నా యంగా వేరే ప్రాంతంలో ఫారెస్ట్‌శాఖకు భూమిని చూపించాల్సి ఉంటుంది.

ఇదిలావుండగా, వరంగల్ జిల్లాలోని మామునూరులో ఎయిర్‌పో ర్టుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. మామునూరుకు కొత్త గూడెం సుమారు 140 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఎయిర్‌పోర్టు అథారిటీ నిబంధనల దృష్ట్యా కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే అవకాశాలు ఉంటాయా లేదా అనేది తెలియాల్సి ఉంది. కొత్త గూడెంలో ఏర్పాటు చేయబోయే విమానాశ్రయం గ్రీన్‌ఫీల్డ్‌కు సంబం ధించినది కావడంతో ఆ నిబంధన వర్తించదని అంటున్నారు. వరం గల్‌లో ఎయిర్‌పోర్టు నిర్మించినప్పటికీ ఈ ప్రాంత ప్రజలు అక్కడికి వెళ్లకుండా, కొత్తగూడెం విమానాశ్రయాన్ని వినియోగించుకుంటారని, అందువల్ల ఇక్కడ నిర్మాణం చేస్తే ఎలాంటి అభ్యంతరాలు ఉండవని అంటున్నారు. కొత్తగూడెం నుంచి హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం సుమారు 300కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అందువల్ల దూరం కారణం రీత్యా అభ్యంతరాలు ఉండవని భావిస్తు న్నారు. ఇతర ఎయిర్‌పోర్టులతో పోల్చుకుంటే గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు పరిమిత సంఖ్యలో విమాన సర్వీసులను నడుపుతుంది. అలాగే దేశీ యంగా ఎంపిక చేసిన ప్రాంతాలకే విమానాలు అందుబాటులో ఉంటాయి. ప్రధానంగా స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టు కొని గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును నిర్వహిస్తారు. దీని నిర్వహణ ఖర్చులు కూడా తక్కువ ఉంటాయని, అందువల్ల సమీపంలోని ఎయిర్‌పోర్టులకు జరిగే నష్టం ఏమీ ఉండదని అంటున్నారు.

పారిశ్రామిక అభివృద్ధికి ఊతం

ఎయిర్‌పోర్టు నిర్మాణం జరిగితే భద్రాద్రి, ఖమ్మం జిల్లాల అభివృ ద్ధికి కొత్తబాటలు పడే అవకాశాలుంటాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద పరిశ్రమ అయిన సింగ రేణి బొగ్గు సంస్థ ప్రధాన కార్యాలయం ఉంది. దీంతో పాటు ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం ఏరియాల్లో సింగరేణి బొగ్గుబా వులు ఉన్నాయి. ప్రధాన కార్యాలయంలో సుమారు 2వేల మందికి పైగా అధికారులు, ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇదే కాకుండా పాల్వంచలో కేటీపీఎస్, నవభారత్, ఎన్ఎండీసీ, అశ్వాపురంలో హెవీవాటర్‌ప్రాజెక్టు, భద్రాచలంలో ఐటీసీ బీపీఎల్ పరిశ్రమలు ఉన్నాయి. భద్రాచలంలోని శ్రీసీతారామ పుణ్యక్షేత్రం ఎంతో ప్రసిద్ధి పొందింది. పారిశ్రామికంగా, ఆధ్యాత్మికంగా, పర్యాటకపరంగా భద్రాద్రి జిల్లా ప్రాధాన్యాన్ని కలిగిఉండటంతో ఎయిర్‌పోర్టు అవ సరం ఎంతగానో కనిపిస్తోంది. అటు ఆయా పరిశ్రమల అధికారులు, ఇటు పర్యాటకులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు ఎయిర్‌పోర్టు ఎంతో ఉపయోగపడుతుంది. ఆదాయపరంగా కూడా ఎయిర్‌పోర్టుకు వయబిలిటీ ఉంటుందని అంటున్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి..

- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యా యులు కృషి చేయాలని ఖమ్మం కలెక్టర్ ముజ మ్మిల్‌ఖాన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ప్రభుత్వ పాఠశా లల పనితీరుపై కలెక్టర్, స్థానిక సంస్థల అద నపు కలెక్టర్ శ్రీజతో కలిసి పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, ఎంఈవోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో 10వ తరగతి పరీక్షలు కీలకమన్నారు. నూరుశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని ఆయన సూచించారు. వారం రోజుల్లో బాగా చదివే పిల్లలు ఏ కేటగిరీ, యావరేజ్ పిల్లలను బీ కేట గిరీ, ఫెయిల్ అవుతారు అనుకునే పిల్లలను సీ కేటగిరీగా విభజించాలన్నారు. డిసెంబరు చివరి నాటికి సిలబస్ పూర్తి చేయాలన్నారు. విద్యార్థు లకు పరీక్షలు అలవాటు అయ్యే విధంగా మరిన్ని పరీక్షలు నిర్వహించాలని అన్నారు. సీ కేటగిరీ విద్యార్థులకు ఇప్పటినుంచి గతంలో పరీ క్షలలో అనేకమార్లు వచ్చిన ప్రశ్నలు, పాఠ్యాం శాలు బోధిస్తూ వారానికి రెండు రోజులు పరీ క్షలు నిర్వహించాలన్నారు.

చదువులో వెనుకబడిన సీ కేటగిరీ విద్యార్థుల తల్లిదండ్రులకు వారానికి 2 సార్లు ఫోన్ చేస్తూ పిల్లలను ఇంట్లో కూడా కొంత సమయం చది వించాలని, చదివే వాతావరణం ఇంట్లో కల్పించా లని సూచించాలన్నారు. నాణ్యమైన ఆహారం అందించాలని ఉపాధ్యాయులు కౌన్సెలింగ్ చేయాలని అన్నారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ఆ సమ యంలో వారికి మంచి పౌష్టికాహారం అందించా లని, దీనికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసి అందజేయాలని కలెక్టర్ తెలి పారు. పాఠశాలల్లో న్యూట్రీ గార్డెన్ ఏర్పాటుకు వీలుగా అవసరమైన కూరగాయల మొక్కలు, మెడిసినల్ మొక్కలు గ్రామాల్లోని నర్సరీలో పెంచేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, ఎంఈవోలు తదిత రులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో అధికారులు, కార్మికులపై పనిభారం

- సత్తుపల్లిలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజినల్ జనరల్ బాడీ సమావేశం
- ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు



ప్రసంగిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు

సత్తుపల్లిరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):ఆర్టీ సీ సంస్థ అధికారులు, కార్మికులపై ఇష్టారీతిన పని భారం మోపుతుందని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్.రావు అన్నారు. బుధవారం సత్తుపల్లి ఆర్టీసీ డిపో నుంచి ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో ప్రద ర్శన నిర్వహించిన అనంతరం కళాభారతిలో రీజినల్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఖమ్మం రీజి యన్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని, అవసర మైన సిబ్బంది నియామకాలు చేపట్టి కార్మికులపై డబుల్ డ్యూటీలు చేయాలనే వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. . డబుల్ డ్యూటీలు (డీడీ) చేయా లనే పేరుతో కార్మికులపై వేధింపులు మానుకోవాలని, బ్రీత్ ఎనలైజర్ కేసులలో నూతనంగా వచ్చిన చట్టాన్ని అమలు చేసేవిధంగా డిపో మేనేజర్లకు తగు మార్గద ర్శకాలు ఇవ్వాలని, ఆర్టీసీ కార్మికులతో అధికారులు మర్యాదగా ప్రవర్తించేలా సూచనలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జనరల్ బాడీ సమావేశంలో ముందుగా గుండు మాధవరావు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం రీజియన్ వర్కింగ్ ప్రెసి డెంట్‌గా గుండు మాధవరావు, రీజినల్ సహాయ కార్య దర్శిగా కేవీ.రామారావులను ఏకగ్రీవంగా ప్రతినిధులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి జే.పద్మావతి, రీజినల్ కోశాధికారి పర్వీనా, తల్లపురెడ్డి చిన్న నర్సా రెడ్డి, డిపోల కార్యదర్శులు చింతలచెరువు వెంకటకృష్ణా రెడ్డి (సీహెచ్‌వీకే.రెడ్డి), కే.వెంకన్న, జీ.రోశయ్య, బీ.బాల కృష్ణ, వి. జాకబ్, టీ.సుధాకర్, జే.ఉపేంద్రాచారి, నాగే శ్వరరావు, శామ్యూల్, సరిత, పద్మావతి, జగన్నాథం, వెంకటయ్య, ప్రభాకర్, సైదారెడ్డి, శంకర్, దొరబాబు, కరుణాకర్, రాంబాబు, ప్రభాకర్, దాసు పాల్గొన్నారు.

పాలనను గాలికొదిలేసి ప్రభుత్వం: రేగా

భద్రాచలం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అధి కారం ఉన్నా లేకపోయినా ప్రజల పక్షాన నిలబడేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని, కేసీఆర్ చెప్పినట్లే కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలు ఆగమాగం అవుతు న్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. భద్రాచలంలో బుధవారం మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా రేగా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రజ లకు ఇబ్బంది వస్తే తెలంగాణ భవన్ ప్రజా సమ స్యల వేదికగా మారిందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరు అధైర్యపడవద్దని భవిష్యత్తులో అధికారంలోకి వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే అన్నారు. ఈ నాయ కులు మానె రామకృష్ణ, గొడవర్తి నరసింహమూర్తి, గంపా రాంబాబు, దొడ్డి తాతారావు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీడీ మణెమ్మ

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

- సమయం పాటించకపోతే చర్యలు తప్పవు
- ఆశ్రమ పాఠశాల తనిఖీలో డీడీ మణెమ్మ

కరకగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించా లని పది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని డీడీ మణెమ్మ ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం మండలంలోని చిరుమళ్ల ఆశ్రమ పాఠశాలను డీడీ మణెమ్మ, ఏటీడీవో అశోక్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ పరిశీలించిన అనంతరం విద్యార్థులకు వండే వంట కాలు, రాత్రి సమయంలో పడుకునే హాస్టల్ వసతులను పరిశీలించిన డీడీ విద్యార్థు లకు వండే వంటకాలు రుచికరంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠ శాల రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనం తరం డీడీ మాట్లాడుతూ.. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని పది విద్యార్థు లకు ప్రత్యేక తరగతులు నేర్పించాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు కొందరు సమయపాలన పాటించడం లేదని, అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరిం చారు. ఉపాధ్యాయులు ఇక్కడే ఉండాలని విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహిం చేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏటీడీవో అశోక్, ఉపాధ్యాయులు శేఖర్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఆస్తులను కాపాడండి

- టీజీటీడీపీఎల్‌సీ, వీహెచ్‌పీ, బీవీపీ, బార్ అసోసియేషన్ ప్రతినిధులు
- తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌కు వినతి


బీఆర్ నాయుడికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఖమ్మం లీగల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):సాక్షాత్తు ఆ కలియుగ ప్రత్యక్షదైవం తిరుమలేశుని ఆస్తులకే రక్షణ లేకుండా పోతోందని తెలంగాణ తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ జనరల్ సెక్రటరీ, గొల్లపూడి రామా రావు, విశ్వహిందూ పరిషత్ కార్యధ్యక్షుడు, భారత్ వికాస్ పరిషత్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు తాళ్లూరి దిలీప్‌చౌదరి, పసుపులేటి శ్రీని వాస్ ప్రతినిధుల బృందం బుధవారం హైదరాబాదులో తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీ.ఆర్.నాయు డుని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజే శారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న తిరుమల తిరుపతిదే వస్థానానికి చెందిన స్థలాన్ని గత ప్రభుత్వ హయాంలో రూ.వందల కోట్ల విలువైన స్థలాన్ని ఎలాంటి అనుమ తులు లేకుండా అక్రమంగా స్వాధీనం చేసుకుని వీధి వ్యాపారస్తుల ప్రాంగణం ఏర్పాటుచేసిందని, గతంలో అదే విషయం మీద 2020లో హైకోర్టులో రిట్ పిటీష న్(17139/2020) వేయడం జరిగిందని తెలిపారు. కాని గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవస్థానం పాలకమం డలి రాజకీయ కారణాల వల్ల సరైన స్పందన కనబర్చ కపోవడంతో విలువైన దేవస్థాన స్థలం దురాక్రమణకు గురైందని, ఈ స్థలం విషయంలో ఎన్నో ఏళ్లుగా దేవస్థా నానికి అప్పగించాలని వివిధ హిందూ సంఘాలు, ప్రజా సంఘాలు పోరాడుతున్నప్పటికీ గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం నుంచి సరైన స్పందనలేదని, ప్రస్తుతం ఈ స్థలానికి సంబంధించిన కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పటికీ, హైకోర్టు ఉత్తర్వులను బేఖా తరు చేస్తూ శాశ్వత నిర్మాణాలు చేపట్టేందుకు మునిసి పల్ కార్పొరేషన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని ఆ ప్రయత్నాలను అడ్డుకొని కలియుగ ప్రత్యక్షదైవం తిరు మలేశుని ఆస్తులను పరిరక్షించాలని వినతిపత్రం అందజేశారు.

విజ్ఞాపనకు సానుకూలంగా స్పందించిన టీటీడీ పాలకమండలి చైర్మన్ బీ.ఆర్.నాయుడు ఈ విష యాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకుని వెళ్తా నని త్వరలోనే దేవస్థానం పాలకమండలి తరఫున రాష్ట్ర చీఫ్ సెక్రటరీకి, మునిసిపల్ శాఖ ముఖ్య కార్యద ర్శికి, ఖమ్మం కలెక్టర్‌కు ఉత్తరాలు రాయడం ద్వారా వివ రణ కోరతామని, ఎన్ని రాజకీయ ఒత్తిళ్లు వున్నా చిత్తశు ద్ధితో దేవుని ఆస్తులు కాపాడటానికి పోరాటం చేస్తు న్నందుకు వారిని అభినందించారు. భవిష్యత్తులో ఎలాంటి అవసరం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

తొలికాన్పు కోసం వస్తే...

- చికిత్స పొందుతూ బాలింత మృతి
- మృతురాలిది వేంసూరు మండలం కల్లూరుగూడెం
- ఆసుపత్రికి రాకుండా ఆపడంతో కిష్టారంలో బాధితుల ఆందోళన


అంబులెన్స్‌లో స్నేహలత మృతదేహం

సత్తుపల్లిరూరల్, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): వేంసూరు మండలంలోని కల్లూరుగూడె నికి చెందిన పిల్లి స్నేహలత(30) ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈనెల 22న స్నేహలతను సత్తుపల్లి లోని రింగ్‌సెంటర్ వద్ద ఓ ఆసుపత్రిలో చేర్పిం చగా పురిటి నొప్పులు రావడంతో వెంటనే సిజేరి యన్ చేయగా మగబిడ్డకు జన్మనిచ్చింది. కాగా కాన్పు అనంతరం బిడ్డకు క్షేమంగా ఉండగా బాలింత స్నేహలత మాత్రం మత్తులోనే ఉండ టంతో సత్తుపల్లి ప్రైవేటు వైద్యుల ఆసుపత్రి సహకారంతో ఖమ్మంలోని మరో ప్రైవేటు ఆసుప త్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. అయితే చికిత్స పొందుతూ బాలింత అయిన స్నేహలత మృతిచెందింది. కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలంటూ సత్తుపల్లికి వస్తుండగా సదరు ఆసుపత్రి నిర్వాహకులు మండలంలోని కిష్టారంలోని కొమ్మే పల్లి రోడ్‌లో అంబులెన్స్‌ను నిలిపివేసి రాజీ కుదిర్చేందుకు బేరసారాలు మాట్లాడారు.

ఉసురు తీసుకున్నారంటూ...

ఆరేళ్ల తర్వాత తొలికాన్పు కోసం ఆసుపత్రికి వస్తే తల్లి ఉసురు తీసు కున్నారని, ఇది ముమ్మాటికి కాన్పు సమయంలో జరిగిన తప్పేనంటూ బాధిత కుటుంబ సభ్యులు కిష్టా రంలో విలపించారు. బాధితురాలి బంధువులు, గ్రామస్తులతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసు కుంది. సదరు ఆసుపత్రి యాజమాన్యం తామే ఖమ్మంలో వైద్య ఖర్చులు భరించామని, బిడ్డ ఆల నాపాలన కోసం రూ.లక్షల్లోనే ముట్టజెప్పేందుకు అంగీకారానికి బాధితురాలి బంధువులు వచ్చా రని సమాచారం. అయితే ఇదే విషయమై సత్తు పల్లి పట్టణ సీఐ టీ.కిరణ్‌ను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలి పారు. కాగా కల్లూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో తలారి సీతారామ్‌ను వివరణ కోరేందుకు ప్రయ త్నించగా ఫోన్‌లో స్పందించలేదు.


కిష్టారంలో ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

గౌతమీ గంగా మంగళమిదే....

- భద్రాచలంలో ఘనంగా పుణ్యనది కార్యక్రమం
- వేద మంత్రాలతో దీపస్తంభ హారతుల సమర్పణ


గోదారమ్మకు పూజలు నిర్వహిస్తున్న ఈవో రమాదేవి

భద్రాచలం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీ కమాసంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాద్రి రామయ్య సన్నిధిలో బుధవారం కార్తీక బహుళ ద్వాదశివేళ నిర్వహించిన పుణ్యనది కార్యక్రమం అశేష భక్తజనాన్ని ఎంతగానో ఆకట్టుకుంది. వేద ఘోషతో ఒక్కసారిగా గోదారమ్మ పులకరించింది. ఈ సమయంలో నదీమతల్లికి అష్టోత్తర శతనా మార్చన నిర్వహించగా శ్రీరామ పాదుకలకు పవిత్ర గోదావరి నదీ జలాలతో సంప్రదాయబ ద్ధంగా అభిషేక కార్యక్రమాన్ని అర్చకస్వాములు నిర్వహించారు. ఈ అపూర్వ దృశ్యాన్ని తిలకించిన భక్తజనం పరవశించింది.

కార్తీక బహుళ ద్వాదశిని పురస్కరించుకుని దక్షిణఅయోధ్య భద్రాచలంలోని పావన గౌతమికి వేదమంత్రాలతో మంగళహారతి సమర్పించారు. ముందుగా శ్రీరామ పాదుకలను పల్లకిలో వేంచేసి మేళతాళాలు, భాజభజంత్రీలు, కోలాటాల నడుమ గౌతమీ తీరానికి తీసుకు వచ్చారు. ముందుగా మంగళవా యిద్యం, దేవస్థానం ఆస్థాన గాయకులు భక్తరామదాసు కీర్త నలను ఆలపించగా.. వేద పండి తులు వేద పఠనం నిర్వహిం చారు. అనంతరం శ్రీరామ పాదు కులకు పవిత్ర గోదావరి నదీ జలాలతో అభిషేకం నిర్వహిం చారు. ఈ సమయంలో పుణ్య నదీ హారతికి వేద పండితులు అర్చక స్వాములు శ్రీకారం చుట్టి సంకల్పంతో ఈ కార్యక్రమానికి నాంది పలికారు. అలాగే గోదావరి తల్లికి అష్టోత్తర శత నామార్చన నిర్వహించి నివే దన, తాంబూలం, హారతి సమర్పించారు. అనం తరం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి గోదారమ్మ తల్లికి పట్టు వస్త్రాలను, తాంబూలాలు, గాజులు, పసుపు కుంకుమ సమర్పించారు.

కాగా ఈ క్రమంలో వేద మంత్రాలతో పుణ్య నదీ మంగళహారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదే సమయంలో దేవస్థానం సిబ్బంది బాణసం చాను పేల్చారు. చివరగా భక్తులు దేవస్థానం వారు అందించిన అరటి డొప్పలతో కార్తీక దీపా లను పవిత్ర గోదావరిలో విడిచారు. ఈ సంద ర్భంగా గోదావరి నదీ ప్రాశస్త్యాన్ని రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచా ర్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు, ఏఈవోలు శ్రవణ్‌కు మార్, భవానీ రామకృష్ణారావు, ఈఈ రవీంద్ర నాథ్, ప్రధాన అర్చకులు అమరవాది విజయరా ఘవన్, ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీని వాస రామానుజం, వేద పండితులు గుడిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, లింగాల రామకృష్ణ ప్రసాద్, చిట్టి హనుమత్‌శాస్త్రి, మల్లూరి రవికు మార్ శర్మ పాల్గొన్నారు.

నింగికేగిన అరుణతార

(5వ పేజీ తరువాయి)

కమ్యూనిస్టు ఉద్యమాలకు ఆకర్షితుడయ్యారు. తర్వాత సొంత గ్రామంలో వ్యవసాయం చేసుకో లేని పరిస్థితి ఏర్పడింది. ఉన్నత విద్య కోసం ఖమ్మం వచ్చి సిద్ధారెడ్డి కాలేజీలో ఏఐఎస్ఎఫ్ నాయకుడిగా విద్యార్థి రాజకీయ జీవితం ప్రారం భించి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎదిగారు. స్వగ్రామంలో రాజకీయ పరిస్థితుల కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ఖమ్మంలో కొన్నిరోజులు ట్రాక్టర్ కిరాయిలు చేస్తూనే ఏఐటీయూసీలో కీలకంగా పనిచేశారు. సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలపై పోరాటాలు చేశారు. 2020 ఫిబ్రవరి 18న ఖమ్మంలో నిర్వహించిన పార్టీ మహాసభలో జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2022లో వైరాలో జరి గిన మహాసభలోనూ రెండోసారి జిల్లా కార్యద ర్శిగా ఎన్నికయ్యారు. అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని పోయే స్వభావం, ముక్కు సూటిగా మాట్లాడే తత్వం ప్రసాద్ రాజకీయ ఎదుగుద లకు దోహదపడింది. కాగా, కార్యకర్తలు, అభిమా నుల కోసం సీపీఐ జిల్లా సమితి కార్యాలయంలో ప్రసాద్ భౌతికకాయన్ని ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉంచారు.

నివాళులర్పించిన మంత్రి పొంగులేటి

ప్రసాద్ కన్నుమూసిన విషయం తెలుసుకున్న రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సీపీఐ కార్యాలయానికి వెళ్లి ఆయన భౌతికకాయా నికి నివాళులర్పించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి సాధి నేని వెంకటేశ్వరరావులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ సోదరి, మహిళా సమితి రాష్ట్ర నాయకురాలు కళావతి తన సోదరుడి భౌతి కకాయంపై పడి కూనంనేనిని పట్టుకొని విలపిం చారు. ఈ సమయంలో కూనంనేని సాంబశివ రావు కూడా కంటతడి పెట్టారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారా యణ, ప్రముఖ గాయకుడు వందేమాతరం శ్రీని వాసరావు తదితరులు సంతాపం ప్రకటించారు.

పలువురి నివాళి..

ప్రసాద్ భౌతికకాయానికి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్య క్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సీపీఎం జిల్లా కార్య దర్శి నున్నా నాగేశ్వరరావు, మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య, జి.రామయ్య, సీపీఐ నాయకులు పోకలపాటి వెంకటేశ్వర్లు, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, బానోత్ చంద్రావతి, మహ్మద్ మౌలానా, టీఎన్‌జీవోస్, టీజీవోస్ నాయకులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, ఎర్రా రమేశ్, తాళ్లూరి శ్రీకాంత్, హరికృష్ణ, పాత్రికేయ సంఘాల నాయకులు, గ్రానైట్, విద్య, వ్యాపార సంస్థల ప్రముఖులు నివాళులర్పించారు. సీపీఐ మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ రాంబ్రహ్మం, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ రామస హాయం రఘురాంరెడ్డి, ఎంపీ వద్దిరాజు రవి చంద్ర, ఎమ్మెల్సీ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, మాజీ ఎంపీ నామా నాగే శ్వరరావు సంతాపం ప్రకటించారు.


నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి

వేగవంతమైన సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ

- డిసెంబరు 6వ తేదీ నాటికి పూర్తిచేయాలని లక్ష్యం
- మరో వందమంది సిబ్బంది కోసం ప్రయత్నాలు

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ కొలిక్కి రావటంతో బుధవారం సర్వే డేటా ఎంట్రీ కొంత వేగవంతమైంది. రోజుకు 147మంది కంప్యూటర్ ఆపరేటర్లు డేటా ఎంట్రీలో పాల్గొంటున్నారు. రోజుకు 2వేల వరకు డేటా ఆన్ లైన్ ఎంట్రీ నమోదు జరుగుతుంది. డేటా ఎంట్రీ ప్రారంభంలో అనేక ఇబ్బందులు రావటంతో మూడు రోజులుగా ఏర్పడిన సమస్యలను పరిష్క రించారు. ఖమ్మం నగర పాలక సంస్థలోని ప్రధా నమైన సమావేశ మందిరాల్లో డేటా ఎంట్రీ ల్యాప్ టాప్‌లు, కంప్యూటర్లు ఏర్పాటు చేశారు. దీంతో రోజుకు సర్వేపత్రాలు ఆన్‌లైన్ జరుగుతున్నాయి.

కాగా మరో 100మంది వరకు డేటా ఎంట్రీ అపరేటర్ల కోసం అధికారులు ప్రయత్నాలు చేస్తు న్నారు. డిసెంబరు 6 నాటికే సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ పూర్తి కావాల్సి ఉంటుంది. ఇప్ప టివరకు కేవలం 5వేల సర్వే పత్రాలు మాత్రమే డేటా ఎంట్రీ జరిగాయి. కాగా ల్యాప్‌టాప్ ఉండి డేటా ఎంట్రీ సామర్థ్యం కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో రెవెన్యూ విభాగాన్ని సంప్రదిస్తే డేటా ఎంట్రీకి తాత్కాలికంగా తీసుకొని ప్రభుత్వం ప్రకటించిన మేరకు వారికి పారితోషకం ఇవ్వటం జరుగుతుందన్నారు. మరోపక్క ఖమ్మం నగరంలో ఇంటింటి సమగ్ర సర్వే తుదిదశకు చేరుకుంది. ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 1,00,316 నివాసాలు గుర్తించగా వాటిలో 91,855 నివాసాలు సర్వే పూర్తి జరిగాయి. 91.57 శాతం సర్వే పూర్తయింది. మరో మూడు రోజుల్లో ఇంటింటి సమగ్ర సర్వేను పూర్తి చేసేందుకు అధి కారులు చర్యలు వేగవంతం చేశారు.

ఇంటింటి సర్వేలో లోపాలు...

ఖమ్మం నగరపాలక సంస్థలో సమగ్ర కుటుంబ సర్వే అసమర్థవంతంగా కొనసాగుతోందని విమ ర్శలు వెలువడుతున్నాయి. ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఆయా నివాసాల్లోని కుటుంబ సభ్యు లతో మాట్లాడి 54 అంశాలను నమూనా పత్రంలో పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ ఎన్యు మరేటర్లు పూర్తిస్థాయిలో అంశాలను నమోదు చేయటం లేదు.

ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ సందర్భంగా అనేక లోపాలు బయటపడుతున్నాయి. సర్వే పూర్తి జరి గిన పత్రాల్లో 50 శాతం మేరకు అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రజల ఆర్థిక, ఉద్యోగ, ఉపాధి వంటి కీలకమైన అంశాలను ఎన్యుమరేటర్లు పూర్తి చేయలేదు.

దీంతో డేటా ఎంట్రీ ఇబ్బందికరంగా మారింది. ఎన్యుమరేటర్లు సర్వే పత్రాలను తీసుకొని క్షేత్రస్థా యిలోని నివాసాలకు వెళ్లి వాటిని పూర్తి చేయాల్సి ఉంటుంది. అలా జరగకుండా ఎన్యుమరేటర్లు ఖమ్మం నగర పాలక సంస్థలోనే కూర్చొని వారికి తోచిన విధంగా సర్వే పత్రాలు దిద్దుబాటు చేస్తు న్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కీలకమైన ఆర్థిక, ఉద్యోగ, ఉపాధి అంశాలకు 2 నెంబర్‌ను నమోదు చేసి ఆన్‌లైన్‌కు పంపుతున్నారు. అలాగే డోర్ లాక్, కుటుంబ సభ్యులు అందుబాటులో లేని నివాసాలకు కేఎంసీలోనే సర్వే పత్రాలు నింపుతున్నట్టు తెలిసింది.

మెరుస్తున్న తెల్లబంగారం

(5వ పేజీ తరువాయి)

పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటు న్నారు. 2022లో పత్తికి ఖమ్మం మార్కెట్‌లో అత్యధికంగా క్వింటాలుకు రూ.13,050 రికార్డు ధర లభించింది. అంతే కాకుండా మూడేళ్ల క్రితం మార్కెట్ యార్డుకు వచ్చిన పత్తిని వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేశారు. కానీ గత రెండేళ్లగా అంతగా డిమాండ్ లేకపోవ డంతో ధరలు పడిపోయాయి. కాగా పత్తికి కేంద్ర ప్రభుత్వ కనీసమద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 నిర్ణయించగా ఈ ఏడాదైనా ఆ ధర దక్కుందని ఆశించిన రైతులకు నిరాశే మిగి లింది. ప్రస్తుతం మళ్లీ ధర పెరుగుతుండంతో గిట్టుబాటు ధర దక్కుతుందని ఆశిస్తున్నారు.


రైతన్న రూట్.. డ్రాగన్ ఫ్రూట్..




దేశీయ వ్యవసాయంలో విదేశీ పంటల సాగు పెరుగుతోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడినిస్తున్న 'డ్రాగెన్ ఫ్రూట్' పంట క్రమంగా రాష్ట్రంలోనూ పెరుగుతోంది. మన ప్రాంతంలో పెరిగే నాగజెముడు, బ్రహ్మ జముడులా కనిపించే కాక్టస్ జాతికి చెందిన డ్రాగెన్ ఫ్రూట్‌ను తెలుగులో 'పితాయ పండు' అంటారు. పొడవాటి స్తంభాలపై ముళ్లతో వేలాడుతూ ముచ్చటైన ఆకారంలో నిగనిగలాడుతూ ఎరుపురంగులో డ్రాగెన్ ఫ్రూట్ సాగుపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

- ఆరోగ్యంతో పాటు సిరులు పండించే విదేశీ పంట
- తక్కువ పెట్టుబడితో రైతుకు ఎక్కువ లాభాలు
- సాగుకు అనుకూలంగా తెలంగాణ వాతావరణ
- రాష్ట్రంలో క్రమంగా విస్తరిస్తున్న తోటలు
- జిల్లాలోనూ సాగుచేస్తున్న కొందరు ఔత్సాహిక రైతులు

అశ్వారావుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అమెరికాకు చెందిన డ్రాగన్‌ఫ్రూట్ ఉష్ణమండల ప్రాంతాలైన ఆసియా దేశాల్లో ఎక్కువగా విస్తరించింది. శ్రీలంక, థాయిలాండ్, మలేషియా, వియత్నాం, బంగ్లాదేశ్‌ల్లో విస్తృతంగా సాగులో ఉంది. ఈ పంటకు తెలంగాణ వాతావరణం అనుకూలంగా ఉండటంతో కొంతమంది ఔత్సాహిక రైతులు పలు జిల్లాల్లో ఈ పంట సాగును ప్రారంభించారు. డ్రాగన్ ఫ్రూట్‌ను మన దగ్గర పండించి గల్ఫ్, యూరోపియన్ దేశాలకు ఎగుమతి చేస్తే అధిక లాభాలు పొందవచ్చునని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.


డ్రాగన్ పుష్పాలు

పుష్కలంగా ఔషధ గుణాలు..

డ్రాగన్‌ఫ్రూట్‌లో విటమిన్-సీ అధికంగా ఉండటంతో పాటు ఆరోగ్యానికి మేలు చేసే విశిష్ట గుణాలు అనేకం ఉన్నాయి. మధురంగా ఉండే డ్రాగన్‌ఫ్రూట్ మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది. కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. ప్రొటీన్లు, మంచి కొవ్వులు అధికంగ కలిగి ఉంటుంది. యాంటీ ఆక్సిడెంట్‌లు, రోగ నిరోధకాలు అధికంగా ఉండటం వల్ల కాన్సర్ నిరోధకంగా పనిచేస్తుంది. చర్మ సౌందర్యాన్ని పెంచుతుంది. శరీర బరువును నియంత్రణలో ఉంచుతుంది. పీచు పదార్థాలు అధికంగా ఉండటంవల్ల జీర్ణవ్యవస్థను మెరుగు పరుస్తుంది. జ్యూస్‌లు, ఐస్ క్రీమ్‌ల తయారీలోనూ డ్రాగన్‌ఫ్రూట్‌ను ఉపయోగిస్తారు.

మూడు రంగుల్లో పండ్లు

ఈ పండ్లు మూడు రకాలుంటాయి. బయట ఎరుపుగా ఉండి లోపల తెలుపు రంగు గుజ్జు ఉండే రకం వాణిజ్యపరంగా ఎక్కువగా సాగులో ఉంది. పండు బయటా లోపలా ఎర్రగా ఉండే మరో రకం పండుకు మార్కెట్‌లో మంచి ధర పలుకుతుంది. కొన్నిచోట్ల బయట పసుపు రంగు ఉండి లోపల తెలుపు రంగు గుజ్జు ఉండే పండ్లు కూడా సాగులో ఉన్నాయి. డ్రాగెన్ మొక్కలను కొమ్మ కత్తిరింపు ద్వారా తయారు చేస్తారు. విత్తనాల ద్వార కూడా మొక్కలను వృద్ధి చేయవచ్చు. కానీ విత్తనాల ద్వారా పెంచే మొక్కలు కాపునివ్వటానికి ఎక్కువ సమయం పడుతుంది. పండు నాణ్యత, దిగుబడి కూడా తగ్గే అవకాశం ఉంది. కాబట్టి కొమ్మ కత్తిరింపుల ద్వారా వృద్ధి చేసిన మొక్కలను నాటుకోవడం మంచిది.


డ్రాగన్ ఫ్రూట్


డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు

సాగు విధానం..

డ్రాగన్‌ఫ్రూట్ మొక్క జీవిత కాలం 20-25 సంవత్సరాలు ఉంటుంది. తీగలా పాకుతూ ఎత్తు పెరుగుతుంది. కాబట్టి దీనికి ఊతం కల్పించాల్సిన అవసరం ఉంటుంది. అందుకోసం సిమెంట్ స్తంభాలను పాతుకోవాలి. స్తంభాలకు మొక్కలను నాలుగువైపులా నాటుకోవచ్చు. స్తంభాల ఎత్తు 2మీటర్ల నుంచి 2.5మీటర్లు వరకు ఉండేలా చూసుకొని దానిపైన రింగుకాని లేద పాత టైరును అమర్చుకోవాలి. భూమిలోపలి వేర్లతో పాటు కొమ్మలకు ఊతం ఇచ్చే వేర్లు ఉంటాయి. సేంద్రీయ ఎరువులు డ్రాగెన్ ప్లాంట్ పెరుగుదలకు బాగ ఉపయోగపడతాయి. ప్రతి మొక్కకు 2 కిలోల సేంద్రీయ ఎరువు ప్రతి సంవత్సరం వేయాలి. డ్రాగెన్ ప్లాంట్ ఎడారి మొక్క కావడం వల్ల తక్కువ నీరు ఉన్నా పెరుగుతుంది. నీరు లేకున్నా కొన్ని నెలలు అలాగే ఉంటుంది. డ్రిప్ పద్దతిలో నీరు అందించడంవల్ల నీటి వృథా తగ్గుతుంది. వేసవికాలంలో ప్రతి మొక్కకు 1-2లీటర్ల నీరు అవసరం అవసరం అవుతుంది. డ్రాగెన్ మొక్క నాటిన 14 నుంచి 18 నెలల్లో కాతకు వస్తుంది. పూత మే-ఆగస్టు వరకు వస్తుంది. కాయలను ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు ఇస్తుంది. పూత వచ్చిన నెల నుంచి కాయలను కోసుకోవచ్చు. కనీసం ఆరు దఫాలుగా ఎరుపురంగు కాయలను మాత్రమే కోయాలి. ఎగుమతికి మాత్రం రంగు మారిన మొదటి రోజే కోసుకోవాలి. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఎకరాకు 6 నుంచి పది టన్నుల దిగుబడి వస్తుంది.

క్రైం సమాచారం

పశుగ్రాసంలో అగ్నిప్రమాదం

వైరా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైరా వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలోని వాణీ వివేకానంద విద్యాలయం పక్కనే ఓ పొలంలో ఉన్న పశుగ్రాసం అగ్నికి ఆహుతైంది. ఆపొలాలకు చెందిన రైతులు తమ పశువుల దానా కోసం గడ్డి పెంచుతున్నాడు. అయితే బుధవారం సాయంత్రం పశుగ్రాసం మంటలపాలైంది. పక్కనే ఉన్న వాణీవివేకానంద పాఠశాలకు త్రుటిలో ప్రమాదం తప్పింది. వైరా అగ్నిమాపక సిబ్బంది సకాలంలో అక్కడకు చేరుకొని మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పిపోయింది.

టిప్పర్ ఢీ.. వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం సాయంత్రం ఖమ్మం నగరంలో జరిగింది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం నగరలోని ఖానాపురానికి చెందిన చెరుకుపల్లి హనుమంతరావు(48)అయ్యప్పమాలధారణలో ఉన్నాడు. ద్విచక్ర వాహనంపై చెరువుబజార్ వైపునుంచి మమతారోడ్డువైపు వెళుతుండగా వెనుకనుంచి వస్తున్న మట్టి టిప్పర్ ఢీకొంది. ఈప్రమాదంలో హనుమంతరావు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అంబులెన్సుకు సమాచారం అందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు.

పోలీసులు పట్టించుకోవటం లేదని
మహిళ ఆత్మహత్యాయత్నం

- ప్రధాన రహదారిపై కుటుంబ సభ్యుల ధర్నా


ఫాతిమాతో మాట్లాడుతున్న ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి

దమ్మపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):భార్యాభర్తల వివాదంలో న్యాయం చేయాలని నెల రోజుల క్రితం దమ్మపేట పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవటంతో కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్‌స్టేషన్ ఎదుట ఓ మహిళ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నం చేసిన ఘటన దమ్మపేటలో బుధవారం జరిగింది. దమ్మపేటకు చెందిన ఫాతిమా అనే యువతికి కొత్తగూడేనికి చెందిన అజ్మత్ అనే వ్యక్తితో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వారి మధ్య విభేదాలు రావటంతో భర్తతో గొడవపడి ఫాతిమా నెలరోజుల క్రితం దమ్మపేటలోని తల్లి వద్దకు వచ్చేసింది. వచ్చిన వెంటనే అత్తంటి వారిపై కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలంటూ దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. అయితే పోలీసులు పట్టించుకోవడం లేదని దమ్మపేట ప్రధాన రహదారిపై కుటుంబ సభ్యులతోకలిసి పోలీసుస్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఫాతిమా తల్లి షైబు తన కుమార్తెకు న్యాయం చేయడం లేదంటూ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. అక్కడే ఉన్న పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. ఈవిషయంపై ఎస్సై సాయికిషోర్‌రెడ్డి సర్దిచెప్పి వేధింపులకు గురిచేసిన భర్తపై కేసునమోదు చేస్తానని హామీ ఇవ్వటంతో కుటుంబసభ్యులు ఆందోళన విరమించారు. ఈవిషయం ఎస్సై సాయికిషోర్‌రెడ్డి వివరణ కోరగా ముస్లిం లా ప్రకారం పరస్పర అంగీకారంలో ఫాతీమా, అజ్మత్ విడాకులు తీసుకున్నట్లు ప్రాథమిక విచారణ లో తెలిసిందన్నారు. దీంతో కేసు నమోదు చేయటంలో కొంత జ్యాప్యం జరిగిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి వీరంగం..

పాల్వంచ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మతిస్థిమితం లేని వ్యక్తి కొద్దిసేపు వీరంగం సృషించాడు. బుధవారం పాల్వంచ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంపు కొనసాగుతుండగా గోదావరిఖరి నుంచి వచ్చిన దేవేందర్ మతిస్థిమితం కోల్పోయి మద్యం మత్తులో కొద్ది సేపు అక్కడ హడావుడి చేశాడు. తనను ఎవరో తరుముకుంటూ వస్తున్నారని, వారు తనను చంపడానికి ముందే తానే ఆత్మహత్య చేసుకుంటానని పెద్దగా అరుస్తూ ప్రక్కనే ఉన్న సాసా పగలగొట్టి గొంతుకోసుకోవడానికి ప్రయత్నించాడు. స్పెషల్ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ నరేష్ చాకచక్యంగా వ్యవహరించి అతడి ప్రయత్నాన్ని అడ్డుకున్నాడు. ఈ క్రమంలో దేవేందర్ మెడకు సీసా గీరుకోగా సదరు కానిస్టేబుల్ చేతికి స్వల్ప గాయమయ్యింది. ఇంతలోనే అప్రమత్తమైన పాల్వంచ టౌన్ పోలీసులు హుటాహుటిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు సంపత్

జూలూరుపాడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అస్సాం రాష్ట్రంలోని ఐఐటీ గౌహతిలో ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చేనెల 3వరకు నాలుగు రోజుల పాటు జరిగే ఇండియన్ ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ ఉపాధ్యాయ వర్క్ షాపునకు కాకర్ల ఉన్నత పాఠశా భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు బి.సంపత్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయనకు బుధవారం నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఇండియా వారి నుంచి ఆహ్వానం అందింది. ఉపాధ్యాయ బోధనలు- మేలుకువలు అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



సమాజ సంక్షేమమే ప్రధానం

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీకమాస మహోత్సవం


మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న రెడ్డిసంక్షేమ సంఘం నాయకులు

కొత్తగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల, అన్నికులాల ప్రజలకు బంధువులుగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, సమాజ హితమే మార్గంగా మహానుభావులు చూపిన మార్గంలో ప్రేమ వాత్సల్యంతో అందర్ని కలుపుకొని రెడ్డి బంధువులు ముందుకు సాగాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. కొత్తగూడెం ఇల్లెందు క్రాస్‌రోడ్డు వద్దగల సెంటరు పార్కులో బుధవారం కొత్తగూడెం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీకమాస వనభోజన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు.

రెడ్డి జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు బుట్టెంగారి మాధవరెడ్డి మాట్లాడుతూ రెడ్లు సమాజం కోసం చేసిన త్యాగాలను కొనియాడారు. తొలుత మంత్రి పొంగులేటికి వేదపండితుల ఆశీర్వచనలతో ఘనంగాస్వాగతం పలికి పూలమాలలతో సత్కారం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఆటపాటలో సభికుల కేరింతలతో సభా వేదిక ప్రాంగణమంతా మారుమోగింది.

ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సంఘం గౌరవ అధ్యక్షుడు సీనియర్, నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి, మేరెడ్డి జనార్థన్ రెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వజ్రాల జమలారెడ్డి, వై. శ్రీనివాసరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జవహర్‌రెడ్డి, పోరెడ్డి గోపాల్‌రెడ్డి, కొడగండ్ల వెంకట్‌రెడ్డి, ముప్పాని సోమిరెడ్డి, కోశాధికారి కాసాని శ్రీనివాసరెడ్డి, అధికార ప్రతినిధి వై. శ్రీనివాసరెడ్డి, ఆర్గనైజేషన్ కార్యదర్శి పైడిమర్ల శ్రీనివాసరెడ్డి, సంఘం నాయకులు లింగం పిచ్చిరెడ్డి, రెడ్డం తులసిరెడ్డి, గుణాకర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కొప్పుల శ్రీనివాసరెడ్డి, రాంరెడ్డి నరేందర్ రెడ్డి, విప్లవరెడ్డి, నాదెళ్ల సుబ్బారెడ్డి, అన్నపురెడ్డి శ్యాంసుందర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ఉడుముల తిరుపతిరెడ్డి, దుగ్గెంబడి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆహారం సరఫరాకు టెండర్ల ఆహ్వానం

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): ఖమ్మం జనరల్ ఆసుపత్రిలో రెండేళ్ల పాటు ఇన్‌పేషెంట్, డ్యూటీ డాక్టర్స్, థెరప్టిక్ పేషెంట్లకు భోజన వసతి (డైట్) కల్పించేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ఖమ్మం కార్యాలయంలో డిసెంబరు 6వరకు టెండర్ ఫారం పొంది, 9వతేదీలోగా అందించాలని సూపరింటెండెంట్ కోరారు.

భద్రాద్రి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా ఉపేందర్‌రావు

చుంచుపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిట్ (ఎస్సీ కార్పొరేషన్) ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ (ఈడీ)గా రాగి ఉపేందర్‌రావు బుధవారం నియమితులయ్యారు. తెలంగాణ షెడ్యూల్డ్ కులముల సహకార అభివృద్ధి సంస్థ హైదారాబాద్ వారి ఉత్తర్వులను అనుసరించి ఉపేందర్‌రావు జిల్లా కలెక్టర్ అండ్ శాఖ జిల్లా చైర్మన్ సమక్షంలో విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఈడీగా విధులు కొనసాగిస్తున్న కె.సంజీవరావు నుంచి బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య


రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

తల్లాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని అమ్మేందుకు వచ్చే రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. బుధవారం తల్లాడలోని సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. సీసీఐ కొనుగోలు కేంద్రంలో ఆన్‌లైన్‌లో సమస్య వల్ల మూడురోజుల నుంచి పత్తి అమ్ముకొనేందుకు వస్తూ ఇబ్బందులు పడుతున్నామని పలువురు రైతులు చెప్పారు. దీంతో వెంకటవీరయ్య జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి ఫోన్ చేసి ఆన్‌లైన్‌లో తలెత్తిన సమస్య గురించి వివరించడంతో అప్పటికప్పుడే సమస్య పరిష్కారమయి పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటవీరయ్య మాట్లాడుతూ సీసీఐ కేంద్రాల్లో సమస్యలను అధికారులు సమన్వయంతో తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీసీఐలో పత్తిని విక్రయించేందుకు కౌలురైతులు కూడా ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి వెంటనే పత్తిని కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ కటికి నర్సింహారావు, బీఆర్ఎస్ నాయకులు దుగ్గిదేవర వెంకట్‌లాల్, దగ్గుల శ్రీనివాస రెడ్డి, వజ్రాల రామిరెడ్డి, ముువ్వా మురళీధర్‌రావు, దిరిశాల దాసూరావు, రాజశేఖర్ రెడ్డి, షేక్.యూసూఫ్, నున్నా చిన్నతిరుమలరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

నిరుపయోగంగా ఫుడ్‌పార్క్ భూములు

- సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం

సత్తుపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రూ.కోట్ల వ్యయంతో బుగ్గపాడులో నిర్మితమైన ఫుడ్‌పార్క్‌కు కేటాయించిన భూములు ఏళ్లుగా నిరుపయోగంగా పడివున్నాయని సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వచ్చేనెల 18,19వ తేదీలలో సత్తుపల్లిలో 28వ జిల్లా మహాసభ నిర్వహించతలపెట్టామని, అన్నివర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్వేశ్వరరావు, జ్యోతి, ఝాన్సీ, సనందన్‌రావు, రమేష్, భాస్కర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఎల్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్

కనుమరుగవుతున్న జీవించే హక్కు

- పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

ఇల్లందు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన కనీస హక్కులు సైతం ప్రజలు స్వేచ్ఛగా అనుభవించలేని పరిస్థితులు పాలకులు కల్పిస్తున్నారని, ఆదివాసీ ప్రజలపై తీవ్ర నిర్బంధం అమలు జరుగుతోందని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ఆరోపించారు. బుధవారం టీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంతెన సంజీవరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంకు హాజరైన ఆయన విలేకర్లతో మాట్లాడారు. మానవ హక్కుల అణిచివేత చర్యలపై డిల్లీలో డిసెంబరు 10, 11 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీపీఎఫ్ నాగభూషణం, మెంతెన సంజీవరావు, సారయ్య, చంద్రమౌళి, రామటెంకి అశోక్ పాల్గొన్నారు.



హైదరాబాదులో స్వామినారాయణ గురుకుల పాఠశాల క్రీడల ప్రారంభ వేడుకల్లో మంత్రి తుమ్మల

ఖమ్మంలో త్వరలో శ్రీ స్వామినారాయణ గురుకుల విద్యాలయం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, నవంబరు 27(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మంలో ఉత్తమ విద్యను అందించేందుకు శ్రీస్వామినారాయణ ట్రస్టు ఆధ్వర్యంలో గురుకుల విద్యాలయం ఏర్పాటుచేయడం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. హైదరాదులోని చేవెళ్ల రోడ్డులోని స్వామినారాయణ గురుకుల క్రీడా పోటీలను మంత్రి తుమ్మల ప్రారంభించి ప్రసంగించారు. స్వామినారాయణ గురుకుల విద్యాలయంలో విలువలతో కూడిన విద్య, సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేయడం జరుగుతుందని, అందులో భాగంగా ఖమ్మంలో ఈగురుకుల పాఠశాలను ఏర్పాటుచేయబోతున్నట్లు మంత్రి ప్రకటించారు. ఖమ్మానికి చెందిన విద్యార్థులు ఇప్పటికే శ్రీస్వామినారాయణ గురుకుల విద్యాలయంలో చదువుతున్నారని, ఖమ్మంలోని ఈపాఠశాల ఏర్పాటుచేయడం ద్వారా ఆప్రాంతంలోని ఎక్కువమంది విద్యార్థులు చదివి రాణించగలుగుతారని మంత్రి పేర్కొన్నారు.

యాగాల నిర్వహణ అభినందనీయం

- జిల్లా కాంగ్రెస్ యువ నేత తుమ్మల యుగంధర్


రుద్ర హోమంలో పాల్గొన్న తుమ్మల యుగంధర్

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): లోక కళ్యాణం కోసం పూజలు, యజ్ఞ యాగాలు, హోమాలు నిర్వహించటం అభినందనీయమని జిల్లా కాంగ్రెస్ యువ నేత తుమ్మల యుగంధర్ అన్నారు. ఖమ్మం మమత ఆసుపత్రి ప్రాంతంలోని జీప్లెక్స్ ఫైవ్ ఎలిమెంట్స్ వద్ద నిర్వహిస్తున్న సహస్ర చండీ సహిత మహా రుద్ర యాగాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన హోమ క్రతువులో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖమ్మంలో మొట్టమొదటిసారిగా గొప్ప పూజా హోమాన్ని నిర్వహించటం అభినందనీయం అన్నారు. క్రతువుకు అవసరమైన అరక్వింటా ఆవునెయ్యిని బహూకరించారు. హోమ కార్యక్రమాలు మరో రెండు రోజుల పాటు జరుగుతాయని ఆసక్తి గల దంపతులు పూజలలో పాల్గొనవచ్చని యాగకర్త దండ్యాల లక్ష్మణ రావు కోరారు. ఈ కార్యక్రమంలో స్థల దాత గుర్రం మురళి, నిర్వాహకులు వెంపటి సత్యనారాయణ, కొప్పు రావూరి వాసు, యాగ బ్రహ్మ రాజోలు భాను రవికిరణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన సర్వే చరిత్రాత్మకం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్


మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

కొత్తగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కులగణన జరిగి బీసీల లెక్కలు తేల్చాలని మూడు దశాబ్దాలుగా చేసిన బీసీల పోరాటం నేడు తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేతో ఫలప్రదమైందని, ఇది చరిత్రాత్మకమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆలంపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు నిర్వహిస్తున్న బీసీ కులగణన చైతన్యయాత్రలో భాగంగా బుధవారం కొత్తగూడెం పట్టణంలో కులగణన చైతన్య సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్, ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడు అకివీడు ప్రసాద్, జిల్లా ఇన్‌చార్జి సోమేశ్వర్‌గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, నాయకులు లక్ష్మణ చారి, వెంకటేష్‌గౌడ్, సౌజన్య పాల్గొన్నారు.

ఎఫ్ఎస్‌వోలో వైరా ఎక్సైజ్ ఎస్ఐకు స్టేట్ ఫస్ట్



వైరా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆహారభద్రతా అధికారి(ఎఫ్ఎస్‌వో) నియామక పరీక్షల్లో వైరా ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ) డాక్టర్ నల్లాల రత్నప్రసాద్‌రెడ్డి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారు. హైదరాబాద్‌లోని చార్మినార్ జోన్‌లో ఎఫ్ఎస్‌వోగా ఎంపికయ్యారు. 2020 గ్రూపు-2 పోటీ పరీక్షల్లో సెలెక్ట్ అయి ఎక్సైజ్ ఎస్ఐగా ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం ఆయన వైరా ఎక్సైజ్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్నారు.



రైతుబజార్ కూరగాయల ధరలు

కూరగాయలు ధరలు
(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	58రూ.
వంకాయ	44
గుత్తి వంకాయ	50
బీరకాయ	48
పచ్చిమిర్చి	24
కాకరకాయ	44
బెండకాయ	28
పొట్లకాయ	38
దొండకాయ	40-48
నాటుచిక్కుడు	100
గోరుచిక్కుడు	38
క్యాబేజీ	34
దోస	28-54
సొరకాయ	28
క్యారెట్	74
క్యాప్సికం	54
అలుగడ్డ	38
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	180
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద్:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	మెకానిక్‌రాకీ
కేపీఎస్:	కంగువ
తిరుమల:	దేవకీనందన వాసుదేవ
సినీ గెలాక్సీ:	జీబ్రా

పనిభారం.. పనుల్లో జాప్యం..

ప్రజావాణికి కనిపించని స్పందన
అర్బన్ తహసీల్దార్ కార్యాలయం తీరు ఇదీ


ఖమ్మంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం

ఖమ్మంటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో పనుల్లో తీవ్రజాప్యం జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రజలనుంచి వచ్చిన సమస్యలు త్వరగా పరిష్కారం చేయటం లేదని పలువురు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నా రు. వీఆర్ఏలను ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియమించినా, పనుల్లో తీవ్రజాప్యం జరగటం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ధ్రువపత్రాల జారీలో సైతం తీవ్ర జాప్యం జరగటంతో పలువురు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసిన అనంతరం చెక్‌స్లిప్ ద్వారా వివరాలు రాసి, అప్‌లోడ్ చేసేవారు. కాగా సరిపడ సిబ్బంది లేకపోవటంతో ఆ విధానానికి స్వస్తి పలికారు. ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు చేసినప్పటికీ వాటిని నెలల కాలం గడిచినా పరిశీలించటం లేదు. దరఖాస్తుదారుడు స్వయంగా కార్యాలయానికి వచ్చి తాను దరఖాస్తు చేసిన మీసేవా స్లిప్, ఇతర ఆధారాలను చూపిస్తేనే ధ్రువపత్రాల జారీ కోసం పరిశీలన జరుగుతోంది. కొంత మంది దరఖాస్తుదారులకు అవగాహన లేక మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసి అలాగే వదిలేస్తున్నారు. సకాలంలో ధ్రువపత్రాలు రాక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రయివేట్ వ్యక్తుల పైనే ఆధారం

వివిధ ధ్రువపత్రాలను జారీచేసే సమయంలో రెవెన్యూ అధికారులు విచారణ చేయాలి. అయితే రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ల వద్ద సిబ్బంది లేక పోవటంతో ప్రయివేట్ వ్యక్తులపై ఆధారపడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రయివేట్ వ్యక్తుల హవా ఎక్కువైనట్లు విమర్శలు ఉన్నాయి.

ముఖ్యంగా జనన, మరణ, కుటుంబసభ్యుల ధ్రువీకరణ, ఈడబ్ల్యుఎస్ తదితర ధ్రువపత్రాల జారీకి సంబంధించి విచారణలో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు వివిధ పనుల్లో బిజీగా ఉండటంతో ప్రయివేట్ వ్యక్తులే తూతూ మంత్రపు విచారణ చేసి, నివేదికలు ఇస్తున్నారు. ముఖ్యంగా డిప్యూటీ తహసీల్దార్ పోస్టును భర్తీ చేయకపోవటం, టైపిస్ట్ డిప్యుటేషన్‌పై వెళ్లటం ధ్రువపత్రాలు జారీలో తీవ్ర జాప్యానికి కారణమవుతున్నాయి.

అడిగిన సమాచారం ఇవ్వరు..

అర్బన్ తహసీల్దార్ కార్యాలయంనుంచి ఏదైనా సమాచారం తీసుకోవాలంటే చుక్కలు చూడాల్సి వస్తున్నదని పలువురు చెబుతున్నారు. సమాచార హక్కు కింద దరఖాస్తు చేసినా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ఇక ప్రభుత్వ భూముల పట్టాలకు సంబంధించి విచారణ కో సం దరఖాస్తు చేసి, నెలల తరబడి తిరిగినా ప ట్టించుకొనే నాధుడు లేడు. సమాచారం కోసం ధరఖాస్తు చేసి, కార్యాలయం చుట్టూ తిరగలేక దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజావాణికి స్పందన నిల్

ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి, ప్రజల సమస్యలు తెలుసుకోవాలని ఉన్నతాధికారుల ఆదేశం. కలెక్టర్ సైతం తహసీల్దార్ కార్యాలయాల్లో జరిగే ప్రజావాణిలో పాల్గొంటున్నారు. అయితే అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో మాత్రం ప్రజావాణికి స్పందన లభించటం లేదు. నగరంలోని సుమారు 4లక్షల మందికి సేవలు అందించే ఈ కార్యాలయంలో సమస్యలపై అర్జీలు ఇచ్చేందుకు ప్రజలు ముందుకు రావటం లేదు. గతంలో ఇద్దరు, ముగ్గురు సమస్యలపై దరఖాస్తులు ఇచ్చారు. తరువాత ఎవరూ రావటంలేదంటే కార్యాలయ పనితీరు అర్థం చేసుకోవచ్చు. కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

అంకితభావంతో పనిచేయాలి: డీఎంహెచ్‌వో


బస్తీదవాఖాన సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రోగులకు నిత్యం వైద్యసేవలను అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి కళావతిబాయి అన్నారు. బుధవారం వై.ఎస్సా.ఆర్. నగర్ బస్తీ దవాఖానాను ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్య ఆరోగ్య సేవలను పరిశీలించారు. ఓపీ సేవలు, ఫార్మాసి స్టోర్, రిజిస్టర్లను పరిశీలించారు. అంకిత భావంతో సేవలు అందించాలని కోరారు. మాతా శిశు సంక్షేమం, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, అసంక్రమణ వ్యాధుల అరికట్టే కార్యక్రమంలను పకడ్బందిగా నిర్వహించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పరిశీలించి, వాక్సిన్ నిలువ, కో ల్డ్ చైన్ మెయింటైన్ చేస్తూ పిల్లలకు టెక్నికల్ గా ఏ ఇబ్బంది లేకుండా అందించాలని ఆదేశించారు.

ప్రైవేటు ఆసుపత్రికి డీఎంహెచ్‌వో నోటీసులు

ఖమ్మం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని వరంగల్ క్రాస్ రోడ్డులో నూతనంగా ప్రారంభించిన బిలీఫ్ ఆసుపత్రికి ఎటువంటి అనుమతులు లేవని డీఎంహెచ్‌వో కళావతిబాయి బుధవారం నోటీసులు జారీ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఆసుపత్రి నిర్వహిస్తున్నారని ఫిర్యాదులు అందడంతో ఆసుపత్రిని తనిఖీ చేసి అనుమతులు లేకుండా ఆసుపత్రి నిర్వహిస్తున్న యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. అయితే ఆసుపత్రి ఏర్పాటు చేసిన భవన నిర్మాణానికి నిబంధనలు సక్రమంగా పాటించలేదని ఇటీవల పంచాయతీ అధికారులు కూడా నోటీసులు జారీ చేశారు.

మానవ హక్కుల సంఘం మండల అధ్యక్షుల నియామకం

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్ఆర్‌సీ)రాష్ట్ర అధ్యక్షుడు బద్దిపడిగ శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో జిల్లాలోని మండలాలకు అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు బుధవారం ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జబ్బూరు మాధవరావు నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులకు నియామక పత్రాలను అందించారు. ఖమ్మం అర్బన్‌కు సాయిశశిధర్, ఏన్కూరుకు భూక్యా సందీప్, ముదిగొండకు మల్లారపు ఉపేందర్, కూసుమంచికి ఉడుత రవి, ఖమ్మం రూరల్‌కు గూదె వీరభద్రం నేలకొండపల్లికి గోరింట్ల లక్ష్మీనారాణ, కొణిజర్లకు తద్దె వెంకటక్రిష్ణలను అధ్యక్షులుగా నీయమించారు. నూతనంగా ఎన్నికైన ఎన్‌హెచ్ఆర్‌సీ మండల అధ్యక్షులు తమపై నమ్మకం ఉంచి మండలాలకు అధ్యక్షులుగా నీయమించిన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వారు మాట్లాడుతూ సమాజంలో అన్యాయాన్ని ప్రశ్నించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని, ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తామని తెలిపారు.

రిటైర్డు ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న ఎర్నేని రామారావు

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నగరంలోని ప్రకాష్‌నగర్ వద్దగల మామిడితోటలో సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షులు ఎర్నేని రామారావు, జిల్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కల్యాణం కృష్ణయ్య, ఎం.సుబ్బయ్య లు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు ఇతరులకు ఆదర్శంగా నిలిచేలా మానసిక ప్రశాంతత ,సమాజ శ్రేయస్సు కోసం అనేక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తాళ్లూరి వేణు, పిసాంబశివరావు, డీకేశర్మ, జనార్ధన్‌రావు, బాబురావు, వెంకటనారాయణ, ఆదినారాయణ, కృష్ణమూర్తి , రమేష్ పాల్గొన్నారు.

సేవే శాశ్వతంగా మిగిలిపోతుంది


ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, దాతలు

రఘునాథపాలెం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపయోగపడే పనులు చేస్తే వారే శాశ్వతంగా నిలిచిపోతారని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. బుధవారం రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కుతుంబాక బసవనారాయాణ, కుతుంబాక కోటేశ్వరరావు జ్ఞాపకార్థం రూ.3.5లక్షలతో నిర్మాణం చేసిన బోర్వెల్, పైప్‌లైన్, ఆర్వో ప్లాంట్, కరెంట్ మోటర్‌లను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రారంభించారు. పాఠశాల విద్యార్థుల మౌళిక అవసరాలను తీర్చిన దాతలను కలెక్టర్ అభినందించారు. విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాల సాధన కోసం కష్టపడి చదవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కోరారు. దాతలు కుతుంబాక మధు, కూరాకుల నాగభూషణాన్ని కలెక్టర్ సన్మానించారు. తాజా మాజీ ఎంపీటీసీ యర్రగర్ల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు అన్నిరంగాల్లో ముందుండాలి

తిరుమలాయపాలెం, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లు అన్నిరంగాల్లో ముందుండాలని మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాదబాబు తెలిపారు. బుధవారం మండలంలోని వెదుళ్లచెరువులో ముదిరాజ్‌సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌ల పిల్లలు బాగా చదివించి వారిని ప్రయోజకులుగా చేయాలన్నారు. ప్రభుత్వ పరంగా అందించే సంక్షేమ పథకాలను అందించేందుకు కృషిచేస్తానన్నారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పెర జానకిరాములు, అనంత రాములు, వెంకటేశ్వర్లు, రాంబాబు , రమేష్, వెంకటరావు, శ్రీను పాల్గొన్నారు.

కనీసం వేతనం మంజూరు చేయాలి

టీఎస్ యూటీఎఫ్ డిమాండ్

ఖమ్మంటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్ (యూఆర్ఎస్), సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది, కార్మికులకు కనీస వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆయా పాఠశాలల ఎదుట భోజన విరామసమయంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ. నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ, యూఆర్ఎస్‌లలో వర్కర్‌నుండి స్పెషల్ ఆఫీసర్ వరకు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే మినిమం టైంస్కేల్‌ను అమలు చేయాలన్నారు. అలాగే విద్యార్థులకు డైట్ ఛార్జీలు పెంచాలని కోరారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే జనవరి 7న జిల్లా కేంద్రంలో నిరాహార దీక్ష, ఫిబ్రవరిలో ఛలో అసెంబ్లీ కార్యక్రమం చేపడుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి వల్లంకొండ రాంబాబు, ఆయా కేజీబీవీల బాధ్యులు,టీఎస్ యూటీఎఫ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

'మాలల సింహగర్జన సభ జయప్రదం చేయండి'

తిరుమలాయపాలెం, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబరు 1 న హైదరాబాదులో జరిగే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని సఘం జిల్లానాయకులు జమ్మి జయపాల్ తెలిపారు. బుధవారం తిరుమలాయపాలెంలో మాలమహానాడు సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా దానికి వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడం దారుణమన్నారు. ప్రతిగ్రామం నుంచి మాలలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అశోక్, దిలీప్, రమేష్, కిరణ్, కనకరాజు, ప్రసన్న, భాస్కర్, పాల్గొన్నారు.

శివాలయం సందర్శన

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా బుధవారం ఖమ్మంలోని పురాతన సుగ్గల వారి తోట శివాలయాన్ని బీజేపీ నేతలు సందర్శించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్రవినోద రావుతోపాటు బీజేపీ జిల్లా నేతలు రుద్రప్రదీప్, పిల్లల మర్రి వెకట్, దార్న శంకర్, ఉదారి రాధాకృష్ణ, మొరం కిరణ్, కాకుమాను నరేందర్ రెడ్డి తదితరులు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు , స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. తాండ్ర వినోదరావు మాట్లాడుతూ ప్రజల చూపు బీజేపీ వైపు ఉందని అన్నారు. మహరాష్ట్రలో బీజేపీ కూటమి అధికారంలోకి రావటం సంతోషకరమని, రానున్న రోజుల్లో తెలంగాణ లో సైతం బీజేపీ ప్రభుత్వం ఏర్పడి ప్రజలకు మంచి జరగాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా ప్రజల జీవితాల్లో సంతోషాలు నిండాలని కోరారు.

పోటు ప్రసాద్ మృతికి పలువురి నివాళి

ఖమ్మంబైపాస్‌రోడ్/నేలకొండపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యదర్శి పోటుప్రసాద్ మృతదేహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ పూలమాలలువేసి నివాళులర్పించారు. పోటుప్రసాద్ అకాలమరణంవిచారకరమని దిగ్భ్రాంతిని వ్యక్తంచేస్తూ సంతాపంతెలిపారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, వెంకటనారాయణ, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్యయాదవ్, ఖమ్మంఅర్బన్‌టౌన్ అధ్యక్షుడు కుమిలి శ్రీనివాస్, రవి రాథోడ్ పాల్గొన్నారు.

నేలకొండపల్లి (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మృతి పట్ల మండల సీపీఐ తీవ్ర సంతాపం ప్రకటించింది. మండల కార్యదర్శి, జిల్లా సమితి సభ్యుడు కర్నాటి భానుప్రసాద్ పోటు ప్రసాద్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. చివరి వరకు పార్టీకి సేవ చేస్తూ, నిజాయితీగా, నిబద్ధతతో వ్యవహరించిన నాయకుడన్నారు. ఆయన మృతి సీపీఐ పార్టీకి తీరని లోటన్నారు. సీపీఐ మండల నాయకులు ఫాల్తియా శ్రీనివాసరావు, భాగం నర్సింహారావు, కాశిబోయిన అయోధ్య తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

అన్నం సేవా ఫౌడేషన్‌లో అన్నదానం


అన్నదానం చేస్తున్న దాతలు

ఖమ్మం వ్యవసాయం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏరీస్ 55వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం ఖమ్మంలోని అన్నం సేవా ఫౌండేషన్ అనాధ ఆశ్రమంలో 220 మందికి అన్నదానం ఏర్పాట్లు చేశారు. ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, ఒరిస్సా రాష్ట్రాలలో ఏరీస్ సంస్థ రైతు సదస్సులను నిర్వహించి, పంటలలో వచ్చే సమస్యలను ఏరీస్ ఉత్పాదనల ప్రాముఖ్యతను తెలియచేస్తు, వృద్ధాశ్రమాలు, అనాధశరణాలయాలు, రైతు సదస్సులలో 2 లక్షల మందికి పైగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు శ్రీ నల్లపనేని బాబురావు, కృష్ణ మూర్తి, శ్రీనివాస రెడ్డి, కోటేష్ తదితరులు ప్రసంగిస్తూ ఏరీస్, నాణ్యతకు చాలా ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తుందని తెలిపారు. 100 రోజుల డ్రోన్ యాత్రను నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు అందరు సద్వినియోగం చేసుకోవాలని తెలియచేశారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం మామిళ్లగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల, పెన్షనర్ల, క్యాజువల్, కాంట్రాక్ట్ వర్కర్ల అపరిష్కృత సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జి సాంబశివరావు కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించాలని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ (బీఎస్ఎన్ఎల్ ఈయూ), ఆల్ ఇండియా పెన్షనర్స్ అసోసియేషన్ , బీఎస్ఎన్ఎల్ క్యాజువల్, కాంట్రాక్ట్ వర్కర్స్ పెడరేషన్ పిలుపు మేరకు బుధవారం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. వేతన సవరణ, పెన్షన్ సవరణ తక్షణమే పరిష్కారం చేయాలన్నారు.బీఎస్ఎన్ఎల్ 4జీ, 5జీ సేవలను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సంస్థలో 2వ వీఆర్ఎస్ అమలుచేయవద్దని వారు కోరారు. కార్యక్రమంలో బీఆర్ వీరాస్వామి, ఎం తిరుమలాచార్యులు, శీనివాసరావు, టి శంకర్రావు, జి రఘురాం, సీనియర్ లీడర్ నాగేశ్వరావు పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీల్లో రెజోనెన్స్ విద్యార్థికి బంగారు పతకం


విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఖమ్మంటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లాలో జడ్పీహెచ్ఎస్ కల్వల స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో రెజోనెన్స్ కళాశాలకు చెందిన విద్యార్థి కొత్తపల్లి వినయ్‌కుమార్ బంగారు పతకం సాధించాడు. బుధవారం విద్యార్థిని కళాశాల డైరెక్టర్లు ఆర్వీ నాగేంద్రకుమార్, కొండ శ్రీధర్‌రావు అభినందించారు. విద్యార్థులను కేవలం చదువులోనే కాకుండా అన్నిరంగాల్లో ముందంజలో ఉండేందుకు తోడ్పాటును అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్స్ సతీష్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

1 నుంచి 9వరకు ప్రజాపాలన విజయోత్సవాలు: కమిషనర్

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1 నుంచి 9 వరకు ఖమ్మం నగర పాలక సంస్థ పరిదిలో ప్రజాపాలన విజయోత్సవాలు జరుగుతాయని, ప్రతి డివిజన్‌లోను ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని కమిషనర్ అభిషేక్ ఆగస్త్య ఆదేశించారు. బుధవారం కేఎంసీలో నిర్వహించిన సమావేశంలో పారిశుధ్య కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు. పారిశుధ్య కార్మికులు యూనిఫాం దరించి పరిశుభ్రత పాటించేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

టీడీపీ సీనియర్ నాయకుడు జయకర్ మృతి


నివాళులర్పిస్తున్న రామనాథం (ఇన్‌సెట్‌లో జయకర్ ఫైల్ పాటో)

ఖమ్మం మామిళ్లగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు రాయపూడి జయకర్ (68) బుధవారం మృతి చెందాడు. ఆయన కొన్ని రోజులు గా ఆరోగ్యం బాగాలేకపోవడంతో బుధవారం తుది శ్వాస విడిచారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి తెలుగుదేశం పార్టీలో ఆయన పనిచేస్తున్నారు. ఆయన టీడీపీ హాయంలో పలు దేవాలయాలకు చైర్మన్‌గా పనిచేశారు. నిస్వార్థ నాయకుడిగా గుర్తింపు పొందిన ఆయన చివరి వరకు టీడీపీలోనే కొనసాగారు. ఆయన పార్థి వ దేహాన్ని టీడీపీ పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, కేతినేని హరీష్, కూరపాటి వెంకటేశ్వర్లు తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. జైకర్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జయకర్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. నివాళులు అర్పించిన వారిలో కొండబాల కరుణాకర్, మందడపు సుధాకర్, చుం దూరు రాజరాజేశ్వరి, నాగార్జున శ్రీనివాస్, పాలడుగు క్రిష్ణప్రసాద్, మందా వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు నాగిరెడ్డి కన్నుమూత


నివాళులర్పిస్తున్న నరేష్‌రెడ్డి

తిరుమలాయపాలెం, నవంబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రామసహాయం నాగిరెడ్డి (65) మంగళవారం అర్ధరాత్రి మృతిచెదాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు మృతిచెందాడు. నాగిరెడ్డి ఈప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ విస్తరణకు కృషి చేశారు. ఆయ కుమారుడు రామసహాయం వెంకటరెడ్డి గ్రామ సర్పంచ్‌గా పనిచేశాడు. వెంకటరెడ్డితో కలిసి అనేక సేవా కార్యక్రమలు చేపట్టారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేశారు. కాగా ఆయన పార్థీవదేహాన్ని జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం వెంకటరెడ్డి నివాళులర్పించారు. కాగా ఏఎంసీ డైరెక్టర్ జడల నగేష్, కాంగ్రెస్‌నాయకులు వేమయుల ఉపేందర్, జడల రమేస్, సుమన్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, మల్సూర్ నివాళులర్పించారు.

సెప్టిక్ ట్యాంకర్లతో కేఎంసీ ఎదుట నిరసన

▸▸ మూడు నెలలుగా వ్యర్థాల తొలగింపులో ఇబ్బందులు ▸▸ సమస్య పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి



కేఎంసీ ఎదుట సెప్టిక్ ట్యాంకర్లతో నిరసన వ్యక్తం చేస్తున్న డ్రైవర్లు

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మున్నేరు వరదల ముంపు ప్రభావం చివరకు మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రంపై కూడా పడింది. అయితే ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఆ దిశగా సమస్యను పరిష్కరించకపోవటంతో పలుమార్లు వినతులు అందించి, అందించి విసుగు చెందిన సెప్టిక్ ట్యాంక్ నిర్వాహకులు ఏకంగా ఖమ్మం నగర పాలక సంస్థ ఎదుట సెప్టిక్ ట్యాంక్‌లతో వినూత్నంగా నిరసన చేపట్టి కమిషనర్ అభిషేక్ ఆగస్త్యకు తమ గోడు తెలిపారు. వివరాలు ఇలా..

సెప్టెంబరు 1న మున్నేరుకు వరద పోటు తీవ్రంగా రావటంతో మున్నేరు పరివాహక ప్రాంతంలో ఉన్న ఎస్ఎస్‌సీసీ (మానవ వ్యర్థాల శుద్ధి కేంద్రం)లోని యంత్రాలు ధ్వంసమైనాయి. ఆ కేంద్రంలోని యంత్రాలకు ఇన్సూరెన్స్ లేక పోవటంతో ఇప్పటి వరకు తిరిగి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో మూడు నెలలుగా సెప్టిక్ ట్యాంకు నిర్వాహకులకు మరుగుదొడ్డి వ్యర్థాలు తరలింపు సమస్యగా మారింది. బహిరంగ ప్రదేశాల్లో పడేస్తే ఆయా స్థలాల యజమానులు కేసులు పెడుతున్నారు. దీంతో సెప్టిక్ ట్యాంకులతో కలిసి నిర్వాహకులు, డ్రైవర్లు మాచర్ల లెనిన్, గుర్రం సందీప్, గొగినేపల్లి హరిష్, ఉప్పయ్య వెంకన్న తదితరులు కేఎంసీ ఎదుట వాహనాలను ఉంచి నిరసన తెలిపారు. అనంతరం కమిషనర్ అభిషేక్ ఆగస్త్యకు వినతిపత్రం ఇవ్వటంతో వారం రోజుల్లో సమస్య పరిష్కారిస్తామని తెలిపారు.

ఏఈవో లేక ఇక్కట్లు

» రుణమాఫీ, పంట నష్టం సర్వేలో గందరగోళం
» జమలాపురం క్లస్టర్‌లో అర్హులకు అందని నష్టపరిహారం



జమలాపురం రైతువేదిక

ఎర్రుపాలెం, నవంబరు27(ఆంధ్రజ్యోతి): మండంలోని ఎర్రుపాలెం, మీనవోలు, ఇనగాలి, బనిగండ్లపాడు, మామునూరు, అయ్యవారి గూడెం, జమలాపురం ఏడు క్లస్టర్లగా ఏడు రైతు వేదికలున్నాయి. వీటిలో ప్రస్తుతం జమలాపురం రైతు వేదికకు ఏఈవో లేకపోవడంతో వ్యవసాయ సంబంధిత కార్యకలాపాలు మందకొడిగా సాగుతున్నాయి. జిల్లాలో ఉత్తమత ఉద్యోగిని తయారుచేసిన రైతువేదిక నేడు చెట్లు, మొక్కలుపెరిగి వ్యవసాయ ట్రాక్టర్ సామాన్లు, కార్లు పెట్టుకునే ఖాళీ ప్రదేశంగా మారింది. ఏఈవోను నియమించాలని జమలాపురం పరిసర ప్రాంత రైతులు విన్నవిస్తున్నారు.

జమలాపురం క్లస్టర్‌లో జమలాపురం, వెంకటాపురం, రాజుపాలెం, నారాయణపురం, సత్యానారాయపురం, గట్లగౌరారం, కాచవరం గ్రామాల్లో మొత్తం 6,200మందికి పై రైతులున్నారు. వీరికి ఏఈవో లేకపోవడంతో రుణమాఫీ కుటుంబ నిర్ధారణ, నష్టపరిహారం సర్వే నిర్వాహణలో జాప్యం జరగడమే కాక, అర్హులకు పరిహారం అందలేదు. స్థానిక ఏఈవో లేకపోవడంతో పక్క డివిజన్ నుంచి వచ్చిన ఏఈవోలకు గ్రామాల్లో అవగహన లేక పంటలను పరిశీలించకుండా, అర్హులను గుర్తించకుండా నష్టాన్ని లెక్కించకుండా నివేదికలను పంపించారు. దీంతో నష్టపరిహారానికి అర్హులకు న్యాయం జరగలేదు. ప్రస్తుతం వరికోతల సమీపిస్తున్నా తరుణంలో ఏఈవో లేకపోవడంతో ధాన్యం సేకరణ, కొనుగోళ్లు, సన్నబియ్యం బోనస్ లెక్క గట్టేందుకు పర్యవేక్షించేందుకు మొత్తంగా జమలాపురం క్లస్టర్‌లో వ్యవసాయశఖకు పలు సవాళ్లను ఎదర్కొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

కొంతమందికే పరిహారం

మండలంలో మొత్తం 3,361 మంది రైతులకు పంటనష్టం జరిగినట్టు ప్రభుత్వానికి నివేదిక అందించారు. జమలాపురం రైతు వేదిక పరిధిలో గ్రామాలకు స్థానికంగా ఏఈవో లేకపోవడంతో వేరే డివిజన్‌నుంచి వచ్చిన ఏఈవోలు నష్టం వాటిల్లిన పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా ఇష్టారీతిన రైతుల పేర్లను హడావుడిగా నమోదు చేశారు. జమలాపురం క్లస్టర్‌లో 600 నుంచి 700 మంది రైతులకు తీవ్ర నష్టం జరిగింది. కాగా నష్టపరిహారం చెల్లింపుల్లో 481 రైతులకు మాత్రమే పరిహారాన్ని నమోదు చేశారు. వీరిలోనే దాదాపుగా వందమంది రైతులకు పైగా ఇప్పటికి అకౌంట్లలో నష్ట పరిహారం జమకాలేదు. పరిహారం చెల్లింపుల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్న రైతులకు కొంత మొత్తంలో పరిహారం చెల్లించారు. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందలేదని పైరు మంచిగా ఉన్న రైతులకు అకౌంట్లలో డబ్బులు పడ్డాయని నష్టపోయిన రైతులు వాపోతున్నారు. కౌలు రైతులను అడిగేనా ధుడు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బదిలీ జరిగి మూడు నెలలు దాటినా

గత ఆగస్టు నెలలో సాధారణ బదిలీలో భాగంగా మండలంలో ఏడు క్లస్టర్లలో ఏఈవోలు బదిలీ అయ్యారు. అన్ని క్లస్టర్లలో ఏఈవోలను భర్తీ చేసినా జమలాపురం క్లస్టర్‌లో ఏఈవో ను నియచమించలేదు. అదే సమయంలో ముదిగొండ నుంచి మందలు రాధ ఎర్రుపాలెం ఎర్రుపాలేనికి బదిలీ అయ్యారు. ఈలోపు మధిర డివిజన్‌లో భారీ వరదలు రావడంతో ఎక్కడివారు అక్కడే స్థిరపడ్డారు. పంటనష్టం సర్వేలో నిమగ్నమయ్యారు. ఈతరుణంలో జమలాపురం క్లస్టర్ ఖాళీగా ఉండిపోవాల్సి వచ్చింది. ఎర్రుపాలెం మండలం కొత్తకావడంతో పరిస్థితులను అవగాహన చేసుకునేందుకు, పర్యవేక్షించేందుకు ఏవోకు తలకుమించిన భారంగా మారింది. కాలం గడుస్తున్న మూడు నెలలు దాటినా ఇప్పటికి ఏఈవో భర్తీకాలేదు. మూలిగేనక్కపై తాటికాయపడినట్టు మండలంలో 7వేల మంది రైతు లున్న ఎర్రుపాలెం క్లస్టర్ ఏఈవోను జమలాపురం రైతువేదికకు ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో భారం పెరిగిపోయి సదరు ఏఈవో కొట్టుమిట్టాడుతున్నాడు. ప్రభుత్వం జమలాపురం క్లస్టర్‌కు ఏఈవోను నియమించాలని రైతులు వేడుకుంటున్నారు.

నష్ట పరిహారం అందలేదు

● ఇడుపులపాటి శ్రీనివాసరావు, రైతు, జమలాపురం



నాకు రెండు ఎకరాల భూమి ఉంది. పత్తి సాగు చేశా. వరదలకు పొలం మొత్తం మునిగిపోయింది. వ్యవసాయ అధికారులు వచ్చి వివరాలు అన్ని రాసుకునిపోయారు. అప్పులు తెచ్చి వ్యవసాయం చేస్తున్నా. పరిహారం అందుతుందనుకున్నా. మళ్లీ అప్పుల మిగిలాయి. అధికారులువస్తారని పొలం అంతే ఉంచా. అంతా గడ్డి మొలిచింది. వేరే పంట సాగుకు మళ్లీ అప్పుతేవడం, చాలా కష్టంగా ఉంది. ప్రభుత్వం ఆదుకుంటుందని వేడకుంటున్నా.

ప్రజాపాలన విజయోత్సవ సభను జయప్రదం చేయండి

» జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొక్కా శేఖర్‌గౌడ్

చింతకాని, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొక్కా శేఖర్‌గౌడ్ కోరారు. మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమన్నారు. వ్యవసాయ సంక్షేమానికి కోసం దేశంలోనే తొలిసారిగా రైతు వ్యవసాయ సంక్షేమ కమీషన్ ఏర్పాటు చేశామన్నారు. ఇచ్చిన హామీ మేరకు వడ్లకు రూ 500 బోనస్ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొప్పుల గోవిందరావు, కొంటిముక్కల నాగేశ్వరరావు, కన్నెబోయిన పాండురంగా రావు, షేక్ నాని తదితరులు పాల్గొన్నారు.

‘ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధర’

ముదిగొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు గిట్టుబాటు ధర దక్కుతుందని ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి అన్నారు. బుధవారం ముదిగొండ మండలం బాణాపురంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈవో వెంకటరత్నం, సొసైటీ డైరెక్టర్ పూర్ణచంద్రరావు, రైతులు వట్టికూటి వెంకటేశ్వర్లు, పచ్చా సీతరామయ్య, లక్ష్మారెడ్డి, రామారావు, సైదులు, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జన సభను జయప్రదం చేయాలి

» ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ రాష్ట్ర కోచైర్మన్ లింగాల రవికుమార్

ముదిగొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో వచ్చేనెల ఒకటిన జరిగే మాలల సింహగర్జన సభను జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ రాష్ట్ర కోచైర్మన్ లింగాల రవికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ముదిగొండ మండలంలోని వెంకటాపురం, చిరుమర్రి, సువర్ణాపురం, గోకినపల్లి, ముదిగొండ తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ముదిగొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. మాలల సింహగర్జన సభలో అధిక సంఖ్యలో మాలలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ ఉండేటి శ్రీనివాసరావు, తోటమళ్ల సీతరాములు, కొమ్ము నర్సింహారావు, రామనాథం, గోవిందు, లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయుల నిరసన

బోనకల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కేజీబీవీ ఉపాధ్యాయులు, సమగ్ర శిక్షా ఉద్యోగులకు మినిమం బేసిక్ ఇవ్వాలని కోరుతూ స్థానిక కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో బుధవారం సమస్యలతో కూడిన ఫ్లకార్డులతో ఉపాధ్యాయులు నిరసన తెలిపా రు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సదాబాబు, గోపాలరావు, రంగారావు పాల్గొన్నారు.

ఏన్కూరు, నవంబరు27(ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం మినిమం టైమ్స్కేల్ అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీఎస్ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రామ్‌చంద్, పుల్లయ్య, నాగేశ్వరరావు, రాధాకృష్ణ, చంద్రప్రకాష్, బి.సింగ్యా శంకరరావు, తదితరులున్నారు.

దీక్షా దివాస్‌తో తెలంగాణ రాష్ట్ర సాధన

» మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



తల్లాడలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

తల్లాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహారదీక్షతో తెలంగాణ స్వరాష్ట్ర సాధన సిద్ధించిందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. బుధవారం తల్లాడలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్‌లాల్, దిరిశాల దాసూరావు, దగ్గుల శ్రీనివాసరెడ్డి, వజ్రాల రామిరెడ్డి, జీవీఆర్, రుద్రాక్ష బ్రహ్మం, కటికి నర్సింహారావు, కోడూరి వీరకృష్ణ, శివారెడ్డి, యూసూఫ్, వెంకటేశ్వర్లు, కృష్ణార్జున్‌రావు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే తెలంగాణ సాకారం

కల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్‌తోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కల సకారం అయిందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చెప్పారు. బుధవారం కల్లూరులో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావానికి ముందు జరిగిన ఉద్యమంలో కేసీఆర్ తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో అని నినాదించి తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రత్యేక తెలంగాణ సాధనే లక్ష్యంగా నిరహార దీక్ష ప్రారంభించరన్నారు. ఈ కార్యక్రమంలో కట్టా అజయ్‌కుమా ర్, లక్కినేని రఘు, ఎస్‌కే కమ్లి, కాటంనేని వెంకటేశ్వరరావు, బోబోలు లక్ష్మణరావు, చావా వెంకటేశ్వరరావు, కోరకొప్పు ప్రసాద్, పెద్దబోయిన మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం కలిగి ఉండాలి

» ఎమ్మెల్యే మట్టా రాగమయి



కిష్టారంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్, నవంబరు27(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. బుధవారం పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి గుడితో పాటు మండలంలోని కిష్టారంలోని సత్తెమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు పత్తిని కొనుగోలు చేయాలి

» అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

తల్లాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీసీఐ నిబంధనల మేరకు జాప్యం లేకుండా, రైతులను ఇబ్బంది పెట్టకుండా పత్తిని కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. బుధవారం సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. సీసీఐ కొనుగోలు కేంద్రంలో ఆన్‌లైన్ సమస్య వల్ల కొనుగోలులో జాప్యం కారణంగా రైతులు పడుతున్న ఇబ్బందుల గురించి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆయన దృష్టికి తీసుకువెళ్లడంతో హుటాహుటిన వచ్చి సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడారు. సీసీఐ నిబంధనల మేరకు తేమ శాతం తక్కువగా ఉన్నప్పటికీ పత్తి కొనుగోలుకు నిరాకరిస్తున్నారని రైతులు చెప్పటంతో అప్పటికప్పుడే అమ్మటానికి వచ్చిన పత్తిలో తేమశాతాన్ని యంత్రంతో ఆయన పరిశీలించారు. తేమశాతం సరిపడా ఉండటంతో ఆపత్తిని కొనుగోలు చేయాలని సీసీఐ అధికారులను ఆయన ఆదేశించారు. ఆన్‌లైన్‌లో పత్తి సాగుచేసినట్లు నమోదు కాలేదనే కారణంతో తమ పత్తిని కొనుగోలు చేయడం లేదని రైతులు చెప్పడంతో మండల వ్యవసాయ అధికారి ఎండీ. తాజుద్దీన్‌తో ఫోన్లో మాట్లాడి ఏఈవోల ద్వారా పంట సాగు ధ్రువీకరణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి గంటా శ్రీలత, తహసీల్దార్ ఏ.వనజ పాల్గొన్నారు.



కొర్లగూడెంలో ధాన్యం నాణ్యతను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

కల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్లగూడెం, పేరువంచ, ఎర్రబంజర గ్రామాల్లో గల ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో రాజేంద్రగౌడ్‌లు సందర్శించి పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు తీరు, ధాన్యం నాణ్యత ప్రమాణాలు, కేంద్రాల్లో ఎంత ధాన్యం కొనుగోలు చేశారు, ఇంకా ఎంత కొనుగోలు చేయాలి గన్నీ సంచుల పరిస్థితిపై నిర్వహకులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీఎం శ్రీలత, డిస్ట్రిక్ కోఆపరేటివ్ అధికారి గంగాధర్, తహసీల్దార్ సాంబశివుడు, ఐకేపీ ఏపీఎం వెంకటారామారావు, సీసీ యస్‌కే ఫాతీమా గ్రామ సమైఖ్య సభ్యులు, సీఈవో కృష్ణారావు, రైతులు పాల్గొన్నారు.

కోతుల పట్టివేత

కారేపల్లి, నవంబరు27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాంధీనగరం గ్రామంలో కోతుల బెడదను తట్టుకోలేక గ్రామస్థులు కోతులు పట్టేవారి చేత బుధవారం కోతులను పట్టించారు. గ్రామస్థులు ఇంటికి రూ.300 వందల చొప్పున వసూలు చేసి కోతులను పట్టించారు. పట్టిన 250 కోతులను ఇనుపబోనులో బంధించారు. వాటిని దూరప్రాంతాల్లోని అడువులలో వదిలిపెట్టనున్నట్లు కోతులను పట్టినవారు తెలిపారు.

పాడి రైతులకు అవగాహన

ఎర్రుపాలెం, నవబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సఖినవీడు గ్రామంలో పాడి రైతులకు అవగహన సదస్సును బుధవారం ని ర్వహించారు. పాల ఉత్పత్తి తీరు, రైతులు తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలించారు. ఈకార్యక్రమలో ఖమ్మం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణాధికారి డాక్టర్ కేకిషోర్, పశువైద్యాధికారి శ్రీకృష్ణారెడ్డి, ఎం.వెంకటేశ్వరరావు, టి.లక్ష్మణాచారి, ఐకేపీ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మణరావు, ఏపీఎం వెంకటేశ్వర్లు, సీసీ రమాదేవి, గోపాలమిత్రలు ఆర్.కృష్ణ, ఆంజనేయులు, ఎస్‌కే రామ్‌రహీం, కె.వెంకటేశ్వర్లు, వై.వీరయ్య, సీహెచ్ వారధిరెడ్డి రైతులు పాల్గొన్నారు .

‘రైతులపై ఎరువుల భారాన్ని తగ్గించాలి’

కొణిజర్ల, నవంబరు27(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు ధరలు పెరగవు గాని, ఎరువుల ధరలను ఇబ్బడిముబ్బడిగా పెంచుతున్నారని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు విమర్శించారు. మండల పరిధిలోని సింగరాయపాలెం గ్రామంలో ఇంటింటికి సీపీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తాళ్ళపల్లి కృష్ణ, చింతనిప్పు చలపతిరావు, దొడ్డపునేని కృష్ణార్జునరావు, ఖాసీం బేగ్, ఎస్‌కె అఫ్జల్, తీగల వెంకట్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు ఎస్ఐగా నాగరాజు



కల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) కల్లూరు ఎస్ఐగా తోట నాగరాజు బుధవారం తన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎస్ఐగా పనిచేసిన యస్‌కె షాకీర్ బదిలీపై మహబుబాబాద్‌కు వెళ్లడంతో, సీపీ కార్యాలయం నుంచి కల్లూరు ఎస్ఐగా నాగరాజు ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐలు, సిబ్బందిలు నూతన ఎస్ఐను కలిసి అభినందనలు తెలిపారు.

పోటు ప్రసాద్ మృతికి నివాళి



వైరాలో ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

వైరా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ హఠాన్మరణం పట్ల వైరాలో సీపీఐ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వైరా సీపీఐ కార్యాలయంలో పోటు ప్రసాద్ చిత్రపటానికి సీపీఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు తదితరులు నివాళులర్పించారు. ప్రసాద్ మృతి సీపీఐకి, ప్రజాసంఘాలకు తీరని లోటని పేర్కొన్నారు. సీపీఐ నాయకులు గారపాటి అశోక్, మిట్టపల్లి రాఘవరావు, షేక్.షరీఫ్, ఆళ్ల రాంబాబు, కొండా రామకృష్ణ, మోట కొండ, బండారుపల్లి ముత్తయ్య, రాంబాబు, తిరుపతయ్య, కోట నాగేశ్వరరావు, సత్యం, సీపీఎం నాయకుడు మందడపు రామారావు నివాళులర్పించారు.

కొణిజర్లనవంబరు27(ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మతి కొణిజర్ల మండలంలోని సీపీఐ నాయకులను, కార్యకర్తలను కలిచివేసింది. మండలంలో పార్టీ కార్యక్రమం ఉందంటే చాలు వెంటనే స్పందించి పోటు ప్రసాద్ వచ్చేవాడని కార్యకర్తలు, నాయకులు గుర్తు చేసుకున్నారు. మండలం నుంచి భారీ ఎత్తున ఖమ్మానికి వెళ్లి పోటు ప్రసాద్ మృతదేహాన్ని సందర్శించి, ఘన నివాళులర్పించారు.

కల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఆకస్మిక మృతిపట్ల కల్లూరులో బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పలు కార్మిక సంఘాలు ఘనమైన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు దామాల దయాకర్, వేము రాంబాబులు ప్రసంగిస్తూ ప్రసాద్ ఆశయాల సాధనకు ముందుకు సాగుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వంశీ, కమల, మల్లయ్య, నాగమణి, మలేఖ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పోరాట ఫలితమే రాష్ట్ర ఆవిర్భావం

» బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల

బోనకల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం జరిగిందని బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ తెలిపారు. మండలంలోని రావినూతల గ్రామంలో బుధవారం జరిగిన ఆ పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 29వ తేదిన ఖమ్మంలో జరగనున్న దీక్షా దీవాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కేసీఆర్ త్యాగాలను చరిత్ర మరవబోదన్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి సాధించిన గుర్తుగా దీక్షా దీవాస్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో రావాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బందం శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల నాయకులు మల్లికార్జున్, నాగేశ్వరరావు, ఉపేందర్, శ్రీనివాసరావు, కనకయ్య తదితరులున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

» ప్రత్యేకాధికారి విజయభాస్కరరెడ్డి

బోనకల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేలా కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి విజయభాస్కరరెడ్డి సూచించారు. బోనకల్ మహాత్మా జ్యోతిభాపూలే బాలుర గురుకుల పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురుకుల పాఠశాలను సందర్శించారు. మెను ప్రకారం భోజనం అందించే వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మటన్ వడ్డిస్తుండగా ఇక్కడనే కట్ చేశారా? లేదా దూర ప్రాంతాల నుంచి తెచ్చారా? అని ప్రశ్నించారు. వేరే చోట నుంచి తీసుకొచ్చామని భోజన నిర్వాహక ఏజెన్సీ వారు చెప్పగా, అసహనం వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు పాఠశాల ప్రాంగణంలోనే మటన్‌కు సంబంధించి కటింగ్ జరపాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నమ్ చందర్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

కల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయిలో ఈ నెల 1 వ తేదీన జరగనున్న అథ్లెటిక్స్ క్రీడ పోటీలకు ఎంపికయ్యారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న బానోతు ఉదయశ్రీ, మధుమితలు ఈ నెల 24వ తేదీన ఖమ్మంలోని సర్దార్ స్టేడియం నందు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల ఎంపికలు నిర్వహించడం జరిగింది. 400 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ సాధించారు. ఎంపికైన విద్యార్థినులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల జరగనున్న క్రీడా పోటీలల్లో పాల్గొననున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి. నివేదిత, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు బి. భీమ, పి. వీరరాఘవయ్యలు విద్యార్థులకు క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

కారేపల్లిలో సర్వే డేటా ఎంట్రీ పరిశీలన



సర్వే డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రాంబాబు

కారేపల్లి, నవంబరు27(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను బుధవారం డీఎల్‌పీవో బి.రాంబాబు పరిశీలించారు. ఈసందర్భంగా డేటా చేస్తున్న విధానంపై ఎన్యూమరేటర్లను అడిగితెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయ న మాట్లాడుతూ ఎంట్రీలో ఎలాంటి పోర పాట్లు లేకుండా చూడాలన్నారు. ఆయన వెం ట తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీవో సురేందర్, ఎంపీవో రవీంద్రప్రసాద్ ఉన్నారు.

ప్రపంచస్థాయి కరాటే పోటీల్లో వైరా విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఏసీపీ రెహ్మాన్, కరస్పాండెంట్ భూమేశ్వరరావు

వైరా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా వైరాలోని న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు ప్రపంచస్థాయి కరాటే పోటీల్లో సత్తా చాటి బంగారు, వెండి పతకాలను సాధించారు. గోవాలో ఎఫ్ఎస్‌కేఏ కరాటే వరల్డ్ కప్ పోటీలు వారం రోజులు జరిగాయి. ఈ పాఠశాలకు చెందిన 9వతరగతి విద్యార్థి కె.శ్రీమన్నారాయణ 14ఏళ్ల పైబడిన విభాగంలో 50కిలోల కట పోటీల్లో బంగారు పతకాన్ని సాధించాడు. అలాగే తొమ్మిదోతరగతికి చెందిన మరో విద్యార్థి రేవంత్ 45కిలోల కట విభాగంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అండర్-12 విభాగంలో ఏడోతరగతి విద్యార్థి భానుప్రసాద్ 30కిలోల కట విభాగంలో వెండి పతకాన్ని సాధించారు. బంగారు, వెండి పతకాలు సాధించిన ఈ విద్యార్థులను వైరా ఏసీపీ ఎం.ఏ.రెహ్మాన్, పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూవ్, ఏవో సామినేని నర్సింహారావు, కరాటే మాస్టర్ మహబూబ్ అభినందించారు.

సీఎం కప్‌లో కరాటే క్రీడ చేర్చడంపై హర్షం

సత్తుపల్లి, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్‌లో కరాటే క్రీడను చేర్చడం పట్ల జిల్లా కరాటే సంఘం బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, స్టేట్ కరాటే ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్‌లకు ఆసంఘ జిల్లా కార్యదర్శి వీ.పిచ్చయ్య కృతజ్ఞతలు తెలిపారు. కాగా జిల్లా కరాటే సంఘం జిల్లా నూతన బాడీ ఎన్నికైన ప్రతులను జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు క్రిష్టోఫర్‌కు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ సునీల్‌రెడ్డిలకు అందజేశామన్నారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు జీ.సైదులు, ఎస్‌కే.ఖాసీమ్, ఎం.గఫూర్, ఎం.బాబు పాల్గొన్నారు.

మధిర ఏటీఎం వద్ద ఘరానా మోసం

» మాయమాటలతో కార్డు పిన్ తెలుసుకొని డబ్బులు డ్రా
» తరుచుగా అమాయకులను మోసగిస్తున్న ఆగంతకుడు

మధిర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మధిర ఎస్‌బీఐ ఏటీఎం వద్ద బుధవారం ఓ వ్యక్తి ఘరానా మోసానికి పాల్పడ్డాడు. మధిరలోని సాయిబాబా దేవాలయం సమీపంలో నివాసముంటున్న దారా రంగారావు బుధవారం తన వృద్ధాప్య పింఛన్ డబ్బులు తీసుకుందామని ఎస్‌బీఐ ఏటీఎంకు వెళ్లాడు. బ్యాంకులో ఉన్న రెండు ఏటీఎంలలో ఒక ఏటీఎం పని చేయకపోవడంతో, అక్కడే ఉన్న మోసగాడు రెండో ఏటీఎంలో వస్తున్నాయని నమ్మబలికి రంగారావు వద్ద ఉన్న ఏటీఎం కార్డును తీసుకున్నాడు. పిన్ నంబరు తెలుసుకొని, కొట్టి డబ్బులు రావడం లేదని మాయమాటలు చెప్పాడు. రంగారావు ఏటీఎం కార్డు ఇవ్వకుండా తన వద్ద ఉన్న వెంకట గంగరాజు అనే ఎస్‌బీఐ కిసాన్ కార్డును ఇచ్చాడు. ఇది తనది కాదని రంగారావు తెలుసుకొనేలోపే డబ్బులు డ్రా చేసుకొని పారిపోయాడు. రంగారావుకు అనుమానం వచ్చి బ్యాంక్‌కు వెళ్లి అడిగితే డబ్బులు రూ.20వేలు డ్రా చేసినట్లు తెలిపారు. దీంతో వెంటనే బాధితుడు టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా సీసీ పుటేజీని పరిశీలించిన పోలీసులు రంగారావుకు కొందరి ఫొటోలు చూపించగా, అందులో ఆగంతకుడి ఫొటో గుర్తించినట్లు సమాచారం. నిందితుడు ఇంతకు మునుపు ఇద్దరి వద్ద ఇదే విధంగా మోసం చేసి డబ్బులు డ్రా చేసినట్లు తెలిసింది. దీని ఆధారంగా టౌన్ ఎస్ఐ సంధ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గంగరాజు కూడా బాధితుడే అని ఎస్‌బీఐ బ్యాంకు వారు పేర్కొనడం విచిత్రం. అంటే ఆ వ్యక్తి బ్యాంక్ వద్దే ఉంటూ తరుచూ ఏటీఎం వద్దకు వచ్చిన అమాయకులను మోసగిస్తున్నా బ్యాంకు వారు పట్టించుకున్నట్లు లేదని పలువురు వినియోగదారులు ఆరోపించారు.

బీమా చెక్కు అందజేత

చింతకాని, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నేరడ గ్రామానికి చెందిన రైతు మంకెన సీతరాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గతంలో మృతుడు సొసైటీలో భీమా నమోదు చేసుకోగా మంజూరైన రూ 50 వేల చెక్కును మృతుని భార్య పద్మకు సొసైటీ చైర్మన్ కొండపల్లి శేఖర్‌రెడ్డి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సీఈవో మా రగాని శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముడి కార్యక్రమం

కొణిజర్ల/తల్లాడు/పెనుబల్లి/సత్తుపల్లి రూరల్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండల పరిధిలోని 170 మంది అయ్యప్పస్వాములు, తల్లాడలో 53 మంది, బుగ్గపాడులో 40మంది, పెనుబల్లి మండలంలోని 150 మంది అయ్యప్ప భక్తులు బుధవారం ఇరుముడితో శబరిమలై యాత్రకు బయల్దేరి వెళ్లారు. పెనుబల్లిలో భక్తులు ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ ప్రారంభించారు.